No. 58

KODANDARAMA LIBRARY
TELAPROLU.

దమయంతి.

అవసరాల శేషగిరిరావుచే

రచియింపఁబడినది.

మొదటికూర్పు 1000 ప్రతులు.

కాకినాడ.

కే. సుబ్బారాయుడు బ్రదర్సువారిచే

స్కేవ్ అండ్ కో., ముద్రాక్షరశాలయందు

ముద్రితము.

1924

[సర్వస్వామ్య సంకలితము.]

[వెల రు 0—8—0

TPLA113B1241
KODANDARAMA LIBRARY
TELAPROLU.

శుభమస్తు.

అవిఘ్నమస్తు.

ఇష్టదేవతా ప్రార్థన.

గీ. శ్రీరఘుకులభూషణ ముని । సేవితజల
జాక్ష బుధజననుత హరి । శరణుశరణు
కలఁదె వేఱొక దిక్కెందుఁ । గరుణఁ బూని
చేరఁదీయవె భక్తుల । చిత్తచోర.

గీ. మాయయనుమాట నెఱిఁగియు । మాయఁ దగ
వడియుఁ బైఁబడఁ జాలని । పశువునైతి
నీదుచరణము లేదిక్కు । నెమ్మితోడ
గావనున్నను రామ నా । గతియుఁ గేవ.

గీ. పాపుఁడైనను మఱియెట్టి । పందయైన
జాలియుండదె సుతునందు । జనకునకును
సర్వజనరక్షకుండవు । సకలజీవ
రాశికాధారభూతుఁడ । రామచంద్ర.

గీ. కన్నుఁదెఱచిన సృష్టియా । కనులమాయ
నాశమానట్టి జగమున । నావనీదు
నామమంత్రమె కావుఁ । నాకిఁకేల
భీతినొందంగ దశరథు । పెద్దతనయ.

గీ. అవతరించితివయ్య యీ । యవనిభార
మంతమొందింప భక్తుల । బాధమాన్ప
నిన్నుఁగొనియాడ నేనెంత । నీతిమతిని
యుడుతభక్తికి మెచ్చవె । యుర్వినాథ.

అంకితము.

సీ. ఎవ్వాని నామంబు నేవేళ స్మరియింపఁ
గలఁత నొందెడు మది కళవహించు
ఎవ్వాని సుస్నేహ మిహపర సాధన
మగుచును విలసిల్లు మహిమతోడ
ఎవ్వాని ముఖబింబ మింపార వీక్షింప
నితర వాంఛల నెన్న నీచ మగును
ఎవ్వాని కరస్పర్శ నేక్షణంబున గల్గ
పావనమగు భాగ్య పదవి యబ్బు

గీ. అట్టి సద్గుణ సంపన్ను నాత్మబంధుఁ
బ్రాణతుల్యుని మిత్రుని పాలగుమ్మి
వంశ సంభూతు సుబ్బరా వాఖ్యవరుని
మది నిఁదలఁచుచు నంకిత మతని కిత్తు.

విజ్ఞాపన

భాషాభిమానులారా!

తనయుల ముద్దుపల్కుల నెన్ని తప్పిదములున్నను, లెక్కింపక, తండ్రులు సంతసించురీతిని, నా యీచిన్నచరిత్రనున్నతప్పుల మన్నించి, నాయందనురక్తులై, వానిని దెలుపఁ బ్రార్థించుచున్నాఁడను.

పీఠిక.

నేనిదివఱకు 'మనోహారిణి' యనంబడు సుమారు 250 పుటలుగల్గిన యొక కేవల కల్పితకథను నవలరూపమున వ్రాసియుంటిని. కాని, యంతకుమున్నుగ 'దమయంతి' యని యెడు పేరంబరఁగు, నీచిన్నిపుస్తకమును, నచ్చొత్తింపఁగుతూహలుండనగుటచే నిదియే నాతొలుతగ్రంథమని చెప్పవలసివచ్చినది. ఈచరిత్రను, దెలియనివారు సాధారణముగనుండరు. కాని, యామూలాగ్రముగ గ్రహింపఁజాలనివారు కొందఱుందురనియు, నిది యింతవఱకు, కావ్యరూపముననుండి, భాషాపాండిత్యమహిమచే విలసిల్లువారికేకాని, యితరులకుఁ దెలియుట యసాధ్యమనియు, నెంచి, బాలురకును, బాలికలకును, కొలఁదివిద్య నభ్యసించిన యువతీమణులకును, ననువుగ నుండునట్లు, సులభశైలిని వ్రాయ నామిత్రులు కొందఱు, పాఠశాలలలో నుపయోగింపఁదగు చరిత్రగ నున్నదనియుఁ ద్వరితంబున నచ్చొత్తింపవలెననియుఁ బ్రోత్సాహపఱుచుటచే, నందులకొడంబడితిని. ఇది కొందఱు పండితులకుఁగూడఁ జూపి, వారి యనుమతినిబడసితిని.

ఇట్లు,

గ్రంథకర్త.

దమయంతి.

మొదటిప్రకరణము.

ఒకనాఁటి సాయంకాలమునఁ జల్లని పిల్లవాయువులు మెల్లమెల్లగ వీచుచు, నెండవేడిమిచేఁ బవలెల్ల నెంతయుడస్సి యున్న జీవరాసుల కత్యంతసుఖము నిచ్చుచు, మనోరంజకమై యొప్పుచుండ, వికసించిన పుష్పసముదాయముచే నిండి, పంక్తులఁదీర్చియున్న పూలచెట్లతోడను, మనోహరముగ వాయుప్రసారమున నటునిటునూగులాడుచు, నావాయువులు తమ్ముఁ దప్పించుకొని పోకుండ నాటంకపఱుప యత్నించుచున్నవో యన్నట్లు జంటలుగ నిల్చున్న పుష్పలతలతోడను, బుష్పములందుండెడి మాధుర్యమును గ్రోలనేతెంచి, 'ఝుం,ఝుం' మ్మనుచు ధ్వనులఁజేసెడి తుమ్మెదలగుంపుతోడను, లేఁజిగుళ్ళను భక్షించుచు, వీనులవిందుగొల్పెడి కోకిలారవంబులతోడను, నిండి రమణీయంబగు నొక యుద్యానవనమున, విలాసార్థము విహరింపఁ గొందఱు రాజపుత్రికలు తమ కనువగు భూషణాలంకారముల ధరియించి, చెలిమియనెడు వనితామోహంబునఁ

దగ్గఱకుఁ జని పరవశులై, యొండొరులకరముల భుజములపై నిడికొని, మృదుమధురాలాపముల సంభాషించుచు, నేతెంచి యెన్నియో చిత్రవిచిత్రములగు నాటలనాడఁ జొచ్చిరి.—

అట్టిసమయమున, నాకసమున గాలిచే నెగురఁగొట్టఁబడిన శరత్కాలమందలి మేఘములయొక్క తునుకలసముదాయమా యనునట్లొకహంసలగుంపు సంచరించుచుఁ దుద కాయుద్యానవనమున నొకసరోవర ప్రాంతమున వ్రాలెను.

వానిఁగాంచి, యారాజనందనులెల్ల నొక్కసారిగఁ దమయాటలను విడిపోయి, యాహంసలను బట్టనుద్యుక్తులైరి. ఎన్నియో విధములు యత్నింపఁగొంతతడవునకు నందొకటి విధివశంబున నొకనికిఁ జిక్కి, యటునిటు నెగయనుంకించుచు, నెట్లైనఁ దప్పించుకొన యత్నించి, నిష్ఫలంబగుటచేఁ దనకా రాజెట్టి యుపాయమొనర్చునోయని వెఱచి మనుష్యవాక్యముల "రాజా! ఫలకుసుమంబులభక్షించుచు, నిట్టిసరోవరములఁ జేరి, యానందమునఁ గాలముఁబుచ్చుచుండువారమగు మావలన నెట్టియపకృతులు జరఁగియుండెను? నీవంటిబుధులు జీవహింస సేయనొల్లకుండుటయేగాక చేయువారినిజూచి సహింపఁజాలరనియెడు నమ్మకముతో నిటస్వేచ్ఛావిహారులమైతిమే గాని, లేకున్న మిమ్ములఁగాంచి నాసిపోకుందుమా! ఇదియునుగాక, జీవహింసయే సిక్కుఁ బ్రియమగునెడ భుజబలాన్వితులగు నెందఱోశత్రురాజులుండ, మేమేకన్పట్టితిమా?

"నా కుమారుండు నలియుఁ గనులు గానలేనట్టియు జనని కలదు. నా ధర్మపత్ని పాతివ్రత్యమే ప్రధానముగఁ దలఁపో యువతిలోకశిరోమణి యగుటచే, నన్ను విడియొక్క క్షణకాలమైన మనియుండఁజాలదు: ఏమియు నెఱుఁగని పసిపాపలు వా యెడఁబాటునకై యెంతయో యేడ్చుచు నాహారమునైన ముట్టకుందురు. ఇతరబంధువులు లేనివాఁడను."

"నీవు సదయాంతఃకరణుఁడవై, నన్ను విడిచితివేని, నీకుఁబ్రియమగు నొక కార్యమొనర్తును. చిగురుటాకులవలెఁ గోమలమగు మేనుగలదియు, శశిబింబముఖియుఁ బద్మపత్రనేత్రియు, సద్గుణాలంకారిణియు, విదర్భరాజుముద్దులపట్టియు, నీమనోహారిణియు, నగుదమయంతి పాలికిఁబోయి, నీగుణ, రూప, విభవముల వర్ణించిచెప్పి, యాకన్యకారత్న మితరులఁ గలనైనఁదలఁపక, నిన్నే వరించునటు లొనర్తును." అనెను.

తొల్లి, నిషధదేశమునకుఁ బ్రభువై, ప్రజలఁగన్నబిడ్డలభాతిఁ గాంచుచు, భూమీసురులయెడఁ దగుభక్తియుక్తముగ నణకువఁగల్గి వర్తించుచు, న్యాయమార్గానువర్తియును వినుతగుణశీలుఁడునగు, నలుఁడను రాజు పరిపాలించుచుఁ బ్రసిద్ధినడయుచుండెను.

ఆరాజన్యచూడామణియు, దమయంతియొక్క సౌందర్యాతిశయంబుల నంతదనుక నెన్నిసారులు కర్ణాకర్ణిగ

వినియుండి, నిత్యమెడ తెగని మోహపాశబద్ధుండై, యెన్నఁడా లలనామణినిఁగూడి సుఖించుభాగ్య మబ్బునోయని, తహతహ పడుచు, నున్మత్తునికైవడి దినములఁ గడపుచుండెను.

అట్టి యానలభూపాలుఁ డానాఁ డారాయంచపలికిన పల్కుల శ్రవణానందముగ విని, చలించినమనస్సుగలవాఁడై, నిట్టూర్పులఁబుచ్చుచు, కొంతయుఁబొక్కి, దానిని బట్టుటకశక్తుఁ డయ్యెనో యనునట్లించుకయుఁ దడయక, హస్తపటుత్వమును వీడ, నదియుఁ గడుసంతసమున, నాకాసారమునఁ గొంతకాలము విహరించి, నలునొద్దసెలవుఁగైకొని, యటనుండి తోడివారలఁగూడి, గగనమార్గానువర్తిని యగుచుండఁ దిరుగ నలుఁడు దానిని జేరి “ఓహంసరాజమా! నీవు నుడివిన నుడువుల మఱవక, నాయందు సదయాంతఃకరణవై, దమయంతీగుణబద్ధచేతస్కుండనై, విరహవేదనావిదగ్ధుండనగు నాకు సంతసమును గొల్పుదువుగాక. నీవు నాచేఁజిక్కిన తరుణమున విలపించినరీతి, నేనాయువతి మోహంబునఁ దగుల్కొని, కుందుచుంటిని. తోడనేతిరిగివచ్చి, దుస్సహమగు నావ్యాకులమును బాపుము.” అనిచెప్పి, యంపెనని దాదిగ నానలుఁడు హంసపల్కులనే మనంబునఁ దలఁచుచు నొక్కచోఁగూర్చుండి, మిత్రుల మోమైనఁ దిలకింపక, తదేకనిష్ఠతో దమయంతీప్రతిమయే గనుచు, నిశ్చలత్వమున నామెనామమే ధ్యానింప మొదలిడెను.

"హా! దమయంతీ! నిన్నుఁ జేరు భాగ్యము లభించునో, లభింపకుండునో! ఏనట్టి విరహతాపమును బాపుకొనఁ గలుగుదును? ఏనాఁడు నీ ప్రతిమఁ గనుఁబారఁ గాంచు కాలము ప్రాప్తించెనో, యానాఁడే మనంబున నిరువరించితిని. కాని, యీవు నన్నుఁ జేపట్ట నిష్టపడుదువో, లేక, నిష్ఫలమనోరథునిగ నొనర్తువో. ఏమి? తాపము తలకంతకుఁ బ్రజ్వరిల్లుచున్నది. ఎవ్వరితో మొఱలిడుదును. నామోహనాంగియే, యీతఱుణమున నాచెంతనున్న నాకీ బాధలు లేకుండునుగదా" అని మహోవ్యథనొందుచుండ, నాతని మిత్రులు దరిఁజేరి "రాజా! ఏమిది? ఇట్లొకగడియ కాలమువలనే, యీ కారణమునకు నేదియో యమితంబగు బాధనొందుచు సొమ్మసిలుచుంటివి. కారణమును దెల్పినఁ దగిన యుపచారము లాచరింతుము." అనియడుగఁ దొడఁగిరి.

న— మిత్రులారా! ఏలొకో యించుక యాయాసము వొడమినది.

అని తనగుట్టును వెల్లడింపక, మఱుమాటాడక యూరకుండెను.

హంసప్రకరణము.

నిరంతర బ్రాహ్మణపూజా ధురంధరుండును, నతిథిసేవాతత్పరుండును, సద్గుణగరిష్ఠుండునై యింద్రు తేజమునఁ

బ్రజలం బాలించుచు, భీముఁడను రాజు విదర్భదేశము నేలుచుండెను.

ఆతఁడు చాలకాలమువఱకు బిడ్డలు లేనివాఁడై, 'అపుత్రస్యగతిర్నాస్తి' యనియెడు శాస్త్రోక్తికిఁ దలఁకుఁగల్గిన వ్యథ కొంతయుఁ గుందుచు నెన్నియోవ్రతముల సల్పుచుండెను. కాని, వానిచే నెట్టియుపయుక్తిని గానక, తుదకు 'దమనుఁ'డను ఋషిపుంగవుఁ బత్నీసమేతుఁడై పూజించి, యాతనిదయకుఁ బాత్రుఁడై దముఁడు, దాంతుఁడు, దమనుఁడను మువ్వురుపుత్రులను, దమయంతి యనునొక పుత్రికారత్నమును బడసి, యానందవార్ధి నోలలాడుచుండెను.

ఆదమయంతియు, నిరుపమానలావణ్యశోభితయై, త్రిజగన్మోహిని యోయనునట్లు, చిన్ననాఁటనుండియు సద్గుణపరంపరలచేఁ బలతూఁగు వనితారత్నమై, తనజననీజనకులకే కాక, చూపరులకెల్ల నమితానందమును గొల్పుచుండెను. ఆధాత చంద్రకాంతిని గొంతహరించి, యాసుందరీవదనమును నిర్మించెనోయనునట్లుండెను.

ఒకనాఁడా సుగుణాలంకారిణి, సుందరవదనలగు సఖులంగూడి, యుద్యానవనసీమను విహరించుచుండెను.

అట్టితఱి, నలునిచే విడువఁబడిన, యామరాళమట కేగి, సఖీజనపరివృతయగు దమయంతిని సమీపించి, మందగమనమున నిట్టట్టు లట్టాడుచుండ, నావైదర్భి దాని శృంగారమును

గాంచి, యెట్టులైనఁ బట్టవలెనను తలంపునఁ దఱుమ మొదలిడెను. ఆహంసయు నామెచేఁ బట్టువడ సిద్ధమగుచున్నట్లు నటించుచుఁ దరిఁ జేరఁగనే, యొక్కగంతువైచి, యింకొకవైపునకుఁ జనుచుండెను. అదికని, చెలికత్తెలు 'పట్టఁజాలవైతి' వని పరిహాసింపఁ బౌరుషంబు మరలయత్నింపఁ బోయెను.

ఇంకఁ దడవొనర్చి, యామె నాయాసంబున ముంచుట పాడికాదని, తలఁచెనో యనునట్లారాయంచ దమయంతికిఁ జిక్కి 'ఓయబలా! నీవు నన్నుఁ బట్ట సమర్థురాలవగుదువా? మాబోంట్ల నెవ్వరైనఁ దమసద్గుణములచే వశపఱచుకొన శక్తులగుదురు కాని, శరీరబలంబునఁ బట్టఁజాలరు."

"అమ్మా! దమయంతీ! ఏనీభూలోకంబెల్లఁ గ్రుమ్మరితిని. నేనుచూడనిరాజులీలోకమున లేరు. వారిలోనెల్ల, నిషధదేశాధీశుఁడగు నలునకెవ్వరేవిధమునను సరిపోలరు. అతని బాహువిక్రమమును వర్ణింపనాతరమే! నవమన్మథుఁడగు నాపురుషరత్నము నీవు సతివి కాకున్న నీసౌందర్యమీయిలను వ్యర్థమేకదా. ఆసుగుణాలంకారుని బతిగఁ గైకొనని నీసుగుణములకుఁ గాంతికల్గునా!" అని యెన్నియోరీతుల నాతని గుణనముల నభినందింప, నావనితా శిరోమణియగు దమయంతి నిశ్చలమనంబున నిట్లనియె.

"ఓహంసరాజమా! నీవు నాపాలిట భాగ్యదేవతవై యవతరించితివి. ఏనా నలసార్వభౌముని దక్క కలనైన నొరు

లవరింపనెల్లను. ఇదియే ముహూర్తమునకె సత్యము. ఏకతముసైన నాజనకుఁడిందుల కియ్యకొనకుండెనా, వినుము. మనోవాక్కా య కర్మములఁ బల్కుచుంటిని. దైవసాక్షిగ నాపాణిబాలు లనలంబున కాహుతిగ నొసర్చి జన్మాంతరమునసైన నాతనిఁ జేరి సుఖింతును, ఈవును నాయందనురక్తవై, నాప్రాణములఁ గాపాడుము. అతని నాకెంకిగించినరీతి, నన్నాతనికిఁ దెలియఁ జేయుము."

అంతనాహంసయుఁ దనదూతకృత్యము నెఱవేరె, ఫల దాయకమయ్యెనుగదాయని, యటనుండి కదలిపోయి, నలుని కావార్తఁదెలిపి తన నివాసమగు సత్యలోకమున కేగెను.

ఆదినమాదిగ నాదమయంతి నలుని మహిమునవీకక, పతివ్రతాధర్మము ననుసరించి, మదినెవ్వనివలచెనో, యాతని నేచేపట్టి సుఖింపవలెనని యము, లేకున్నఁదనకిహలోక సుఖమే శూన్యమని యునెంచి, విరహవేదనఁ జిక్కి దినదినము క్షీణించు చుండ, నిఁకఁదడయుటకెట్టి యవకాశమును లేదనిగ్రహించి, యాపె చెలికత్తెలు భీమునియొద్దకుఁబోయి యారీతిని దెలిపిరి.

"రాజా! ఒకానొక దినమున దమయంతియు మేము నుగూడి యుద్యానవనమున విహరించుచుండ నొకహంసల గుంపటకేతెంచి, యందొకటి దమయంతిచేఁ బట్టువడి, నలమ హారాజుయొక్క గుణరూపవర్ణనలు వర్ణించిచెప్పెను. నాఁటి నుండియు దమయంతి హంస నలుని వర్ణించుచుఁబల్కిన వ

ల్కలనే గణించుచు, అదిపోయినదారినే చూచుచుండును. సఖులమగు మాతో మాటాడక, ప్రతిక్షణమున నేమియో తలంచుచు, నిట్టూర్పులం బుచ్చుచు, వెక్కసపడుచుండును. ఆభరణముల ధరింపనొల్లదు. ఆహారము నందుంగాని, విహారము నందుంగాని యిష్టపడక, యింతన నేల కూర్చుండుటకును, నిల్చుటకునుగూడ నశక్తురాలై, దివారాత్రములు నిదురింపక, నల భూపాలునందె బుద్ధినిలిపి, పుష్పవిలుకాని బాణంబులసొక్కుచుం గాలమతికష్టమున గడపుచుండెను. మేమెన్నిరీతుల నోదార్ప యత్నించినను వ్యర్థమగుటచే నీవార్తమీకెఱింగింప సాహసించితిమి. కొలందికాలమట్లున్నం దుదకుం బ్రాణహానికూడం జేకూరునే మోయను భీతివొడముచున్నయది."

ఈపల్కుల వినినంతనే, భీమరాజు భయవ్యాకుల హృదయుండై, యానల భూపాలు నేవిధి రావింపనగునో యని చింతిల్లనారంభించెను.

తదనంతరము భీముండు దమయంతిని రావించి "అమ్మా! నీవిట్లు దినదినము క్షీణించుచుండుటచే, నామనం బెంతయుం దత్తరిల్లుచున్నయది. తల్లీ! అందని పండ్లకాసించిన నేమిఫలము చేకూరును? రాజాధిరాజగు నానలసార్వభౌముని టకెట్లు రావింపనగును? ఒకవేళ వార్తనంపిన నందులకియ్యకొనునో, లేక, నిరాకరించునో? నిరాకరించినచో నట్టి యవమానము ఘటిల్లునో యెంచుము." అనిదీనాననుండై పల్కెను.

ద—జనకా! మీరిట్లు నుడువుట పాడియగునా? తన్ను వలచి, దైవముగఁ దలపోయు నాబోంటి వనితను నిర్దయుఁడై వీడనంతటి కృతఘ్నుఁడగునా? నా దురదృష్టవశమున నట్లైనచో మరణమే శరణ్యము. ఏ నేక్షణమున నాతని మనంబున నెంచియుంటినో, యప్పుడే నాథునిగ నెంచితిని. పరులఁగలనైన వరింపనొల్లను. పతివ్రతలెంతైన మానభంగమగునెడ సహింపనోపుదురా. తొలుత నొకనిఁ గోరి, మఱియొకనిఁ జేపట్టుట కళంకమునకుఁ జోటొసంగుట కాదా? చేపట్టిన నాతని చేపట్టవలయును. లేకున్న వసువులవీడి పరలోకప్రాప్తినొందవలెను.

భీ—అట్లయిన నాకుండునేమి యనుభయంబున నిట్లని యుంటినే కాని, యట్టి మహానుభావుని నల్లునిగఁ గొనుటకంటె మహాభాగ్య మేమి కలదు? మన పుణ్యవశమున, దైవము కటాక్షించి, నీకోర్కెను నెఱవేర్చును గాక.

ఇట్లుండఁ గొంత కాలమునకా భీమరాజెట్లైన నలుని రావించి దమయంతి యొక్క కోర్కెను దీర్పవలెనని 'దమయంతీ స్వయంవర'మని యెల్లెడలఁ జాటఁ బంపెను.

భానుని రాకకై వేచియుండు పద్మము కైవడి నెన్నఁడు తన మనోనాయికయగు నా మోహనాంగిని గాంచఁ గల్గుదునోయని తొట్రుపాటునొందుచున్న నలభూపాలుఁడుము కొంతేయు నుష్ణాంగి కృతకృత్యుండ నగు కాలము ప్రాప్తించెనుగదా యని సంతసమునఁ దానును బయలు వెడలెను.

ఆసమయమున నావిదర్భాపుర మాయింద్రపురమున కెనయై శోభిల్లుచుండెను.

మూడవ ప్రకరణము.

తత్సమయంబున సర్వలోకసంచారియగు నారదుండు భూలోకమంతయుఁదిరిగి తుద కింద్రలోకమునకుఁ బోవ నింద్రుఁడు వానిఁగాంచి "నారదా! ఎంతయో కాలమునుండి మానవలోకమున నుండెడు రాజుల భండనముల సహాతులై స్వర్గలోకసుఖముల నందరాకుండుట కేమి హేతువు?" అని యడిగెను.

నా—ఇప్పుడచ్చోట మనుజకాంతలనేగాక దేవతావనితలఁ గూడ సౌందర్యమున ధిక్కరించునదియు, సుగుణాలంకారిణియునై వర్తిల్లుచుండెడి దమయంతీ స్వయంవర మెంతయో వైభవమున జరుగనున్నది. అందుచే ధరణీశులెల్లఁ దత్కుతూహలంబునఁ దమలోఁ దమకెట్టి శత్రుత్వమును లేక యుద్ధభూముల మడియకుండిరి.

'అట్లయిన మేమును గనులపండువుగఁ గాంచఁబోదు'మని యాతనియొద్ద సెలవుగైకొని యింద్రుఁడు దమయంతీస్వయంవరమును దిలకింప దిక్పాలురఁగూడి బయలుదేరెను.

వారలారీతినిఁ బయనమొనర్చుచు మార్గమధ్యమున దివ్యసుందరమూర్తి యనఁదగు నలునిఁగాంచి 'రాజా! రాజా!', యని యాకసమునుండియే పిలువ నాపలుకు లెవ్వరివో యెదిశనుండివచ్చెనో యని నలుఁడు నలువంకలఁ బరికించి కనకరత్నవిమానారూఢులగు నా దేవతలఁ గాంచి నమస్కరించెను.

వారును గ్రిందికివచ్చి నలునిసమీపించి "ఓనలరాజా! మేము దేవతలము. ఏనింద్రుండను, వీరు దిక్పాలురు. నేమొక కార్యార్థ మీలోకమున కేతెంచి నీసాహాయ్య మపేక్షించుచుంటిమి. అందుల కీవొడంబడి మాకోర్కెను నెఱవేర్తువుగాక యని కోరుచుంటిమి" అని యింద్రుఁడు పలుక నలుఁడు "అయ్యా! నా భాగ్యమేమని కొనియాడుదును. మీకుఁబ్రియమగు కార్యమాచరించి నన్ను కృతార్థునిఁ జేయుఁడ" నెను. ...ఁడుభాగ్యమున్నదా?. అదేమియో సత్వరంబునఁ దెల్పి నన్నుఁ గృతార్థునిఁ జేయుఁడ" నెను.

ఇం—అట్లయినఁ దెల్పెదను వినుము. ఏము దమయంతీస్వయంవర మిపుడుగ జరుగనుంట విని యామెచే వరింపఁబడుటకు వచ్చితిమి. నీవు దమయంతికడ కేగి యీవార్త ముందుగ నామెకెఱుఁగఁజేసి మాలోఁ దనకనురూపుఁ డగువానినొక్కనిఁ జేపట్ట వేఁడితిమని చెప్పుము.

ఆహా! ఆమాటలు నలునిపాలిటి యభాగ్యదేవతలయ్యెను. కర్ణకఠోరములగు వానుమాటల కేట్రియుత్తరమీయఁగలఁ

డు. హతభాగ్యుఁడ నైతినిగదా యని చింతిల్లెను. నోటమా టరాక నివ్వెఱపడి చూచుచుండ నింద్రుఁడు వానిఁగాంచి "ఏమిరాజా! యాలోచించుచుంటివి? ఎట్టి కార్యమునైనఁ ద గుభక్తిశ్రద్ధలతో నాచరింతునని కదా యింతకు ముందె నె క్కి వక్కాణించియుంటివి" అనెను.

న—ఆర్యా! నేను తత్కార్యార్థినై యేతెంచు వాఁడనని తెలిసియుండియు నిట్లాజ్ఞాపించుట తగునా? ఇంతి యేకాక మహాత్మా! నేనట్లా కాంతాంతఃపురమును జొరశ క్తుఁడ నగుదును.?

అంతనా దేవేంద్రుఁడు తక్కిన దేవతలఁగాంచి "నరుఁడేద నూనృతవ్రతమేమి? ఈతఁడు నిత్యసత్యవ్రతుఁడని నమ్మి మో సపోయితిమి. పోదమురండు." అని పయనము కాఁదొడఁగిరి.

న—స్వామీ! మీరిట్లుకినుకఁబూనుట న్యాయమగు నా? క్షమింపుఁడు. ఏరికిఁ దెలియకుండ నేనటకేగు విధమును దెలుపుఁడు.

ఆపల్కులకు వారు సంతుష్టాంతరంగులై యింద్రుఁ డొకమణి నాతనికొసంగి దానిచే నెవ్వరికంటఁ బడక పోవగున ని వరంబిచ్చి పంపెను.

నలుఁడును నటనుండి బయలువెడలి మనమున నెన్ని యో తర్కవితర్కంబులకు లోనై తుదకింద్రునిచేతనొసంగఁబ

దినమణి పశ్చిమభాగమున దమయంతియొక్క యంతఃపురమును జొచ్చెను.

మోహనిద్రాపరవశయైయున్న యాకాంతాశిరోమణి యాతనిరాక తొలుతఁ దెలిసికొనఁజాలనిదాయెను. నలుఁడా దమయంతి సోయగముఁగాంచి 'హా! నేనెంత యదృష్టహీనుఁడనగు కాలము ప్రాప్తించెను! ఈయలివేణి రూపసౌందర్యముల నాఁడు హంసచే వినినంతకంటె వేయిమడుంగులెక్కుడై యనాతీతమై యొప్పుచున్నయది. ఈకాంత నిక్కముగ నాయిమ్రిసకు రాణియగుటకుఁ దగియుండెనేకాని నాబోఁటి మానవులకుఁ జేపట్టఁ దగినదా ? ఇంకను నాకీయాసలేటికి ? అయ్యో ! ఏలనాకీనాఁడీదేవతలు కన్పట్టవలె ? కన్పట్టిరో వారేలనన్నీదూతభావంబున నియమింపవలె ? ఎన్నినాళ్ళనుండియో యేనాఁడీసుందరాంగినిగూడి సుఖించు భాగ్యమబ్బునో యని దినములలెక్కించుచుండి యీరాయంచపల్కులవిని నిశ్చయమనస్కుఁడనైతిని. అన్నియు నిరర్థకములయ్యెను. నన్నుఁబోలు వ్యర్థులెందైననుందురా ? " అనిపరిపరివిధములఁదలఁచుచు జింతాక్రాంతుఁడైయుండ నంతలో దమయంతి 'హా! ప్రాణేశ్వరానలరాజా ! ఎన్నఁడు నినుఁగనులఁ గాంచుపుణ్యములభించునో ? స్వయంవరమునకు వచ్చెదవో ? రాకుందువో ? " అనికలువరింపఁ దొడఁగెను.

"నిద్రావస్థనుగూడ నీపై నానామమే స్మరించుచున్నది. ఏమిసేయువాఁడ" నని నలుఁడు మిక్కుటముగఁ గలతఁబొందసాగెను.

కొంతతడవునకామె మేల్కని నలునిఁజూచి పరపురుషుఁడిట్లు చొర నశక్యమగు తనయంతఃపురమును జేరెనని శంకించి "అయ్యా! తామెవ్వరు? అత్యుగ్రశాసనుఁడగు నాజనకునిచే నియోగింపఁబడిన సేవకాబృందముచేఁగాపాడఁబడు నిచ్చోటి కెట్లు రాఁగలిగితిరి?" అని ప్రశ్నించెను.

న—కాంతారత్నమా! ఏను దేవదూతను. ఇంద్రాదిదేవతలు భూలోకమునకేతెంచి వారిలోనొక్కనిఁ జేపట్టి సుఖియింప నిన్ను బ్రార్థింపుమని ముందుగ నన్ను నీయొద్దకుఁబుత్తెంచిరి. వారిప్రభావముచేతనే యెవ్వరికిఁ గానరాక నీయంతఃపురమును జేరఁగల్గితిని.

ఆవాక్యములువినుటతోడనే దమయంతి ఖిన్నవదనయై, "ఆర్యా! ఏనెల్లవేళ నెంతయు భక్తితో నాదేవతలకు మ్రొక్కుచుందును. వారిపాదధూళికైన సరికాక, మానవజన్మనొంది సంసారిణినై యుండఁదగు నేనెడ! వారలెచ్చట? ఏను నలభూపాలునే మనంబున వరించియుంటిని. ఇప్పుడన్యులఁ గోరుదాననే? పరిణయమాడిన నాతనినే పరిణయమాడవలయును. లేదా, ప్రాణముల వీడవలె" నని తనకృతనిశ్చయమును వెలిబుచ్చెను.

న—లలనామణీ! నీసౌందర్యమున కెంతయు మెచ్చి నిన్ను వరించు నిచ్ఛనుండ, వారినిఁజూడి సుఖమొందక, యొక మానవుని జేపట్టిన నేమిఫలము?

ద—మీరిట్లు నుడువుట పాడియగునా? ముందుగను దినొకనిఁగోరి, పిమ్మట వేఱొకనిఁ జేపట్టుట పాతివ్రత్యమునకుఁ గళంకముకాదా? అట్లొడంబడి, యేనెట్టి దుర్గతుల పాలుకాఁ గలను?

న—అనలుఁడే వచ్చి, వారిలో నొకని వరింపుమనిన నేమిసేయుదువు?

ద—నిష్కళంక హృదయులగు నాబోఁటి వనితల నిట్లు పరిహాసింప న్యాయమగునా? అనలుఁడట్లేల నుడువును? నుడివినచో పతివ్రతలకగ్గమగు మృత్యుదేవత యే కలవగునా?

"ఓ మగువా! యింకదాచనేల? నిన్నుఁ దలచి, సకసంతమగు సంతాపమును కూర్చిన యాపాపాత్ముఁడగు నలుఁడు వీఁడే. ఈవాదేవతల యాభీష్టమును దీర్చి, సుఖముందుము"

దమయంతి యాతఁడే నలుఁడగుట యెఱిఁగి, సిగ్గునొందుచు "మహాత్మా! ఆదేవతల సన్నిధానముననే, నిన్ను వరించెదను. అట్లైన నిర్దోషంబగును." అని యటనుండి వెడలి పోయెను.

నలుఁడును మరల దేవతలకడకేగి జరిగిన వృత్తాంతమెల్లఁ దెలియఁజేసెను.

నాలుగవ ప్రకరణము.

స్వయంవరము జరుగనున్న దివసమేతెంచి విదర్భాపురమున నెచ్చోటఁ గాంచినను రాజపుత్రసముదాయముచే నిండి ప్రతివారును దమయంతిచే వరింపఁబడి సంతసమందుదమని యెడ నాసక్తితో నెప్పుడాముహూర్తకాలమేతెంచు నని యెదురుచూచుచుండిరి. పురమంతయు నలంకరింపఁబడి కన్నుల పండువై శోభిల్లుచుండెను. ఇంతననేల! భూలోకస్వర్గమా యనునట్లుండెను. నలునిరాకను దెలిసికొని భీమరాజు తనకోరికె నెఱవేఱునుగదా యని కడు సంతసంబును జెందినవాఁడై తనపుత్రికారత్నము సకలభాగ్యసంశోభితయై వర్ధిల్లునని యుల్లాసమున నుండెను.

రాజభవనమున నొక్కచో స్వయంవరాభిలాషులై వచ్చిన రాజకుమారులెల్ల భీమునిచే నాహ్వానింపఁబడి యుచితాసనముల నధిష్ఠించియుండ రాజాజ్ఞచే నొక చెలికత్తె వెంట రాఁగాఁ జేత నొక పుష్పమాలికను ధరించి మందగమనమున వచ్చు నలినాక్షిని దమయంతినిఁ జూచి యట నున్నవారెల్లఁ జేతనాశూన్యులై యీయింతిని జేపట్టినవాని జన్మమేల యని పరిపరిరీతులఁ దలపోయఁ జొచ్చిరి.

ఆచెలికత్తెయు దమయంతికరము నొక హస్తమునం బట్టి రెండవ చేతితో నటనున్న రాజన్యుల నొక్కరొక్కరిగఁ జూపుచు వారి గుణ రూప విభవముల వర్ణించుచు నాదమయంతితోఁ దన కనురూపుఁడగువాని వరింపుమని చెప్పుచుండెను.

ప్రతివారియెడను విముఖయగు నావనిత తుదకు నలుని యొద్దకు వచ్చి తనచేతనున్న పుష్పహారమును ధరింపనాతఁడేసమర్థుఁడని యెంచి దానిచే వానినలంకరింపసమకట్టెను. కాని యచ్చోట నొక్కనలుఁడే కాక యాతనిఁబోలు వారింకను నల్వురుండిరి. వారిలో నలుని గుర్తెఱింపఁజాలక దమయంతి యిదేమిచిత్రమోయని వెఱగుపడుచు నది దేవతలమాయకాని వేఱొండుకాదని తలఁచి తనమనంబున "సురలార! నిరంతరము మానసంబున మిమ్ముఁబీడక స్మరించుచుండెడి భక్తురాలను, దీనురాలును, నబలయు నగు నాయందా మీకో్రధభావములు చూపుట. దీనవత్సలురగు మీరలే యిట్లు నిర్దయులై కినుకఁ బూని వంచింపనెంచిన నింకేమి తెఱువు కలదు. నేనొనర్చిన పాపమేమి? ఇప్పుడైన నాయందలి కోపముడిగి దయాపరులై భవదీయరూపముల ధరియింపుడు." అని ప్రార్థింప భక్తులఁ గాచుటయే ముఖ్యకర్తవ్యమని తలపోయు నాదేవతలు తత్క్షణంబ యనిమిషలోచనంబులతోను నస్వేద గాత్రంబులతోను భూతలంబును ముట్టక నిలిచిరి.

అటనున్నవారెల్ల రాశ్చర్య నిమగ్నులై యాదమయంతీ ప్రభావమున కచ్చెరువందుచుండ నాసుదతి దేవతల సన్నిధానమున నలునివరించి చేతనున్న పూలమాలిక చే నాతనికంఠసీమ నలంకరించెను. దేవతలును, విప్రులును, వృద్ధులును నాశీర్వదించిరి.

అంతనింద్రుఁడు నలమహారాజునుఁగాంచి వానియజ్ఞంబులయందు నిజరూపమున హావిర్భాగంబుఁగొనను, గుబేరుఁడు ధనసంచయంబు లక్షయంబు లగునట్లును, అగ్ని వానిఁదలచినచోట ననలోదకంబు లుత్పాదింపను, యముండు వానిమనసెల్లవేళల ధర్మమునందే వర్తింపను, వరంబులిచ్చి తమ నివాసములకుఁ జనిరి.

తక్కినరాజులెల్లఁ దమకాశ సిరర్థకమగుటచే దీనానన్నులై యొక్కరొక్కరుగ నామంటపమును వీడి మెల్లమెల్లగ నడువనారంభించిరి.

ఇంద్రాదిదేవతలు తమలోకమునకేతెంచుచుఁ దమకెదురుగవచ్చెడు వికృతరూపుఁడును భయంకరాకారుఁడునగు కలిసిఁగాంచి దేవేంద్రుఁడాతని కుశలమడిగి యెటకేగుచుంటివని ప్రశ్నించెను.

క—భూలోకమున దమయంతి స్వయంవరమగుటవిని యామెచే వరియింపఁబడుదు ననియెడు కౌతూహలంబున నందులకుఁ బోవుచుంటిని.

అందులకాయింద్రుఁడు నగి “అన్నియును బూర్తియయ్యెను. ఆయలివేణి సురల నెవ్వరిని మెచ్చక నలుఁడను భూపాలుని వరించెను. కాన నీవిటనుండియే మరలిపోనగు” ననెను.

ఆపలుకులు కర్ణకఠోరములై చెవిసోఁకఁగనే కలి రోషావేశవివశుఁడై భూనభోంతరములు తల్లడిల్ల “ఏమి? దమయంతి మానవాధముఁడగు నలుఁడను వానివరించెనుగా? అట్లయిన నాప్రతిజ్ఞ వినుఁడు. బ్రహ్మాది సురలక్షంబై నిల్చి వినుతురుగాక! ఏను మానక యానలుని రాజ్యభ్రష్టునిగఁ జేసి యాదంపతులనెడబాటొనర్చి దారుణారణ్యంబులఁ బడద్రోచి పాట్లనుభవింపఁ జేసెద”నని గర్జింప నింద్రాది సురలు భయకంపితస్వాంతులై నిరపరాధులగు వారికెట్టి ముప్పు వాటిల్లనుండెనో యని చింతిల్లి యేమిచేయుటకుఁ దోపక తమత్రోవను బోయిరి.

ప్రతిజ్ఞాపరిపాలనకై వేచియున్న కలి నలునందుఁ బ్రవేశింపనశక్తుఁడై తుదకొకనాఁడు నలుఁడశుచియై మఱచి సంధ్యోపాసనంబొనర్పఁ దనకదియే తగుసమయమని యెంచి, కలి నలునందుఁ బ్రవేశించెను.

నలునకుఁ బినతండ్రి కొమరుండును, దుర్మదాంధుఁడును, కపటియుఁ బరనిందయుఁ బరదారాపహరణమును సహజగుణంబులుగఁ గలవాఁడునగు పుష్కరుఁడను వాఁడొకఁడుండెను. అతఁడెట్టి క్రూరుఁడైనను నలునియొక్క కఠినశాసన

మతిభ్రమింపజేసిన కలిపురుషునిచే నావహింపబడియుండి, మొన్నటివరకుని వాంఛింప సమయమునకు నెదురుచూచుచు వేచియుండెను.

ఇట్లుండఁగ కలి పుష్కరునొద్దకుఁ బోయి, తన్నాశ్రయించి "రాజా! నీవిప్పుడు నలునితో జూదమాడి, యాతని సర్వసంపదల నోడించికొమ్ము. నేను, నీకుఁ గపటవేషంబున సహాయుండనై, వర్తించెద" ననెను.

అంతట నాతఁడాతని సమీపించి, నిష్కళంకుఁడును, నిష్కపటాత్ముఁడును, ధర్మానువర్తనుండును, గలిసమావేశహృదయుఁడునగు, నలుపాలికరిగి, తనతో జూదమాడుమని కోరెను.

అకార్యమొనర్ప నయిష్టుఁడయ్యును, నొకనిచేఁ బిలువఁబడి జూదమాడకుండుట యనుచితంబని యెంచి నలుఁడందులకియ్యకొనెను.

చలించిన మనస్సు గలవాఁడై, కలియొక్క ప్రేరణచే నెందఱు హితులు బోధించినను వినక, నలుఁడు జూదమునందుఁ దనకున్న సర్వసంపదలఁ బోఁగొట్టుకొను చుండుటవిని దమయంతి చింతించుచుండి, పురోహితులు మొదలగు బుధులరావించి, తననాథుని వారింపఁ బంపెను.

చెడుకాలము ప్రాప్తించిన వేళనంతయు నంధకారబంధురమై కన్పట్టును. నలుఁడు రాజ్యమాదిగ నన్ని వైభవముల నుండి తొలఁగవలసిన వాఁడయ్యెను. తోడనే పతివ్రతాశిరోమ

ణిమగు దమయంతి, రాచప్పయిమములగ్రహించి, వార్ష్ణేయుం డను సారథినిఁబిలిచి, పతియనుమతివడసి, కొడుకును, గూతును, దనజననిజనకుల యొద్దకుఁబంపెను.

సర్వస్వహీనుండై, దీనత్వమునఁ దలవంచి యూరకున్న నలునిఁజూచి, పుష్కరుఁడు "నలా! నీవు నేటిదినము నరాత్రికాలమునసే, పురమునువీడి పోవలెను. కట్టుగుడ్డలు తక్కనితరము లన్నిటినిచటనే పీకిచవలెను." అనియాజ్ఞాపించెను.

ఐదవ ప్రకరణము.

శ్రీ కోమన గ్రంథాలయం తెల ప్రోలు

నలుఁడు రాజ్యభ్రష్టుండై దీనవదనంబున దమయంతి వదన మేరీతిని దిలకింపనగునోయని, కలఁతనొందుచుఁ దుదకేమి సేయుటకుఁదోఁపక యంతఃపురమును జొచ్చెను.

వానిఁగనుఁగొని, యెదురేగి, యాదమయంతి "హా! నాథా! మనకట్టియిడుములు ప్రాప్తించెను. ఈదీనత్వమునకు గతియేమి? దుర్మార్గవర్తనుండగు నాపుష్కరునిచే, ధనమెల్లఁ గోలుపోవునప్పుడైన మాయజూదమని తోపకుండెనా? ప కలైశ్వర్యములఁ బోఁగొట్టిన మనకిఁకేమిశరణ్యము?" అనివిలపింపఁదొడఁగెను.

DAMA LIBRARY
TELAPROLU.

దమయంతి.

కన్నులనీరుగ్రుక్కుచు, నలుఁడు "ప్రాణేశ్వరీ! ఏ[illegible]
మిసేయుదును? చీకటియుండఁగనె తెలి[illegible]నప్పుడు,
కాన్పింపకుండెడి చందంబున, నామనం బజ్ఞానాంధకారమున
మునిఁగి, కర్మానుసారఫలం బనుభవింపవల్లెను. ఈనాఁడే
యీ చోటును వీడిపోవునట్లు, పుష్కరుఁడాజ్ఞాపించినాఁడు. లే
కున్న వెతల నడుపుమనని, క్రోధపూరితుఁడై నడిచెను. కాన
నికఁ దడయుట పాడి కాదు" అని చెప్పి యంతఃపురమును వీడి,
బాష్పధారలచేఁ గనులు మూతవడి, శరీరము కంపింప [illegible]గు
లు తడఁబడుచుఁ దమయంతి ద్వితీయుండై, బయలు వెడలి, పు
రము వెలుపల మూడహోరాత్రములు వసియించియుండెను.
అంతదనుక, నలునే దైవముగా భావించుచున్న ప్రజలందఱు
క్రూరుఁడగు పుష్కరుని యొక్క క్రౌర్యశాసనబంధమున యాతని జే
రకుండిరి.

పిమ్మట నలుఁడు దుఃఖము పొరలి, పొరలి, వచ్చుచుండ
దమయంతినిఁ గాంచి "ఓరమణీ! యీవు నావంటి దురదృష్ట
హీనునిఁ జేపట్టి, కడరాని యిడుమలఁ బడుచుంటివి. ఈమార్గము
లను గనుము. ఇదియె విదర్భపురమునకుఁ బోవు దారి. ఇది కోసల
దేశమునకుఁ బోవు. ఇట్లేగిన నుజ్జయినీనగరమును జేరవచ్చును.
ఇందు మన మేగుటకేది యనువుగ నుండును? అని యడుగ
నందులకా వనిత "నాథా! యింగులకింతగఁ దర్కించనేల?
మనమిరువురమును గూడ, మా జనకుని రాజ్యమగు విదర్భదేశ
మునకుఁ బోద" మనెను.

న—ప్రాణేశ్వరీ! నీవనినట్లా విదర్భేశుని రాజ్యమును మనరాజ్యమే. కాని, యేనుతొల్లి యధికైశ్వర్యములం దుల తూఁగువేళనటకేగి, యందఱకు సంతోషమును గొల్పి, నేఁడు సర్వమును కోఁగొట్టుకొని ఎట్లుపోవనేర్తును? ఈవు కాననంబులఁ దిరుగుచు నిడుమలందఁజాలవు. కాన నీవేగి సుఖింపుము.

ఆదీనాలాపములవిని "మనోహరా! కష్టకాలములందే ధైర్యమూనిచరింపవలెను. మీరిట్లు పల్కుట న్యాయమగునా? మగువలకుఁ బతియే దైవము. పతియే సర్వసంపదలై పోడకట్టును. అట్టిపతి మిమ్మునువీడి యొక్కతెనైన నిలువనోపుదునా? మీరుపతిలేనియెడ నాకాతుచ్ఛసుఖములేల? ఏనును మీకుఁ దోడునై, మీవెనువెంటనే వచ్చెదను." అని దమయంతి కన్నులనశ్రుబిందువు లొలుక, పలికెను.

న—సఖీ! ఎన్నఁడెండకన్నెఱుఁగని యంతఃపుర కాంతవగు నీవాకౄరమృగవ్యాకులంబగు దారుణారణ్యంబులఁ దిరుగుచు, నిడుమలనందఁజాలవని యట్లంటినే కాని, నిన్నువీడి నేనుమాత్రము సహింపఁగలనా? కావున నీయిచ్ఛవచ్చినట్లువర్తింపుము.

దమయంతియుఁ బతిదయకుఁ బాత్రురాలనైతిని గదా యని, యమందానందమునొంది, యిరువురుగలిసి పయనమును సాగింపమొదలిడిరి. కొంతదూరము సాగినవెనుక, అంతఃపురమునువీడి, యుద్యానవన విహారమునర్చుటయే కష్టతరమనియెం

ము నాసుకుమారి, కఠిన శిలావృతంబగు నేలల నడచుచు, నొక్కొక్కమారు చిలుకపలుకులకే యదటిపడు లలితాంగి క్రూరమృగారావంబుల వినుచు, మేడ కిడిగినికొని, నాఁకటిబాధను దాళఁజాలక, ముందునకొకయడుగైన విడనోపక, యొకతరుచ్ఛాయను జేరి విశ్రమించెను.

నలుఁడును, ఆవనితా తాపంబునకు సహింపనోపక, క్షుద్బాధ శమింపఁ జేయనెంచి, తనయెదుట హిరణ్యపక్షంబులతో నెగిరెడు పక్షులఁగని, పట్టనుకట్టి, తనపైనున్న వస్త్రమునువిసరివేయ నవియునావస్త్రముతో నాకసమున కెగసి నలునితో "నీధనమును, రాజ్యమును మాయోపాయమునఁ గైకొన్న, యక్షులగు నేము నీవస్త్రము నపహరింప నీరూపమున నేతెంచి, మాపనినెఱవేర్చుకొంటి" మని చెప్పిపోయెను. విధివ్రాతకెంతయుఁ జింతనొందుచు, నలదమయంతులేక వస్త్రధారులైయుండ, దమయంతి "నాథా! ఆఁకటిబాధ యంతకంతకు హెచ్చుచు, నిఁకప్రాణములు నిలుచుటయే కష్టమైతోచుచున్నయది. సహింపఁజాలకుంటిని" నెను,

ఇంతలో నెచ్చట నుండియో, యొక ఫలమువారిసమీపమునఁబడ, నలుఁడత్యాతురతను దానిఁగైకొని, నాఁటికదితిని. యాఁకటిని దీర్చుకొమ్మని దమయంతితోనుడువ, నాపతివ్రతాతిలకము తనకదివలదనియు, నాతనినే భుజింపుమనియు వేఁడెను.

ఇట్లొకరినొకరు భుజింపుమని, తగ్గించుచుండఁ గలి, విప్రవేషధారుఁడై వచ్చి, తానెన్నియోదినములనుండి యుప, వాసశ్రమచే సొక్కుచుంటినినియు, యిట్టిడన్న మొసఁగి ప్రాణదానమొనర్పుడనియు, వేఁడెను.

న — అయ్యా! యేము దమవలెనే యాఁకటిచేఁబీడింపఁబడుచుండ మీకెట్లు సహాయమొనర్పఁగలము?

క — ఏమి? అన్నమిడఁజాలకున్నను, నీచేతనున్న ఫలమైన నొసంగి, జీవములఁ గాపాడఁజాలవా?

"విప్రోత్తమా! ఈగుట్టుప్రక్కలనెచ్చటఁ జూచిన నిట్టివృక్షమే కన్పట్టుటలేదు. అందుచేనిది యెట్టివిషఫలమో యని, సంశయము పొడముచున్నయది"

"ఏది? యిటు తెమ్ము. చూతము." అని దానినిఁగొని గ్రక్కున నోటవైచికొని "రాజా! ఎంతమాయలమారివి? ఇంతరుచ్యమగు ఫలమును విషఫలమంటివా? కానిమ్ము. అందువలననే, యిట్టిపాట్లననుభవింపుచుంటివి," అనిమెన్నియోరీతుల నిష్ఠురోక్తులఁ బలికి, యంతర్ధానము నొందెను.

మార్గాయాసమునఁ గన్నులుమూఁతపడకున్న, నలుఁడు లేచి, తనయార్యలే తలగడలుకాగ, యతిక్లేశపరవశయై నిద్రించుచుండెడి దమయంతినిఁగని, యాపెవదన మెట్టివారి యందఁ దుఃఖపూరితుఁడై "ఏనెన్నఁడెట్టి మహాపాతక మాచరించి యుంటినో? ఈలలనామణి, పతిభక్తిచేఁ బుత్రినిఁ బు

త్రికను, బుట్టినింటికనిపి, యెన్నిరీతుల వలదని బ్రతిమాలినను వినక, నన్నే యాధారముగఁ దలఁచి యేతెంచెను. అట్టి పతివ్రతారత్నమగు నొకయబల కిట్టి బాధను దొలఁగింపఁజాలని యధముఁడ నైతిని. ఏమి సేయుటకును దోఁపక, యెన్ని విధముల నూరటనొందెదమన్నను వ్యర్థమగుచున్నయది. ఈమెనిట్లు, అభాగ్యుఁడనగు నాతోఁ ద్రిప్పుకొనుట యుచితము కాదు. ఇప్పుడీమె గాఢనిద్రఁ దగుల్కొనియున్నది. ఇట్టి తఱినిట విడిపోయిన నీమె మేల్కొని నలుగడలఁ బరికించి, నన్నుఁ గానక, తుదకుఁ దనజననీజనకుల కడ కేగి సుఖించును." అనియెంచి, యాపెవస్త్రంబునర్ధంబుఁ జించి, తనకు బరిధానంబుగఁ జేసికొని, మెల్లమెల్లగ నటనుండి పోవనుద్యుక్తుఁడయ్యెను. కాని యిటునటునూఁగులాడుతూఁగుటుయ్యెలవలె మనంబు చలించుచు దమయంతి యందుండెడు ప్రేమయనెడుత్రాఁగను దెంపనేరక, కొంతదూరమేగి తిరిగివచ్చును. పోఁబోవును. కదలఁజాలఁడు. తుదకుఁ గలిమాయామహాప్రభావమున మనమును దృఢపఱచుకొని హతభాగ్యుఁడు, దమయంతిని నాదారుణారణ్యమున నేమృగముల పాలఁబడునో యనియైనశంకనొందక నిర్దయుఁడై యొంటరిగ విడిపోయెను.

కొంతవడికి, దమయంతి మేల్కాంచి, శేవనశక్తురాలై తననాథుఁడేమి సేయుచుండెనోయని, కన్నులొకింత తెఱచిచూచెను.

ఆమె మనంబేలోకోత్తరపడుచు నిలువెల్లఁ జెమ్మటలు క్రమ్మ నారంభించెను. "నాథా, నాథా" యని యాటునిటు తొట్రిపాటుచేఁ జూచుచు నరచుటకు యత్నింపుచుఁ గాళ్లు తడఁబడఁ జొచ్చెను.

"ప్రాణేశ్వరా! ఎటుచుంటిరి? నిద్రాసక్తనైతినని క్రోధమా? ఎచ్చోట దాఁగియుంటిరి? చాలుఁ జాలు. ఇదియా పరిహాసమునకుఁ దావు? మిమ్ముఁ జూడక యొక్కక్షణకాలమైన నిలువఁగలనా? ఏపొదలచాటుననో దాఁగియున్న యబలనగు నేనెట్లు తెలిసికొందును? రండు నాథా!" అనియిట్లున్మాదినియై వడి నలునియందుండెడు ప్రేమాతిరేకంబున నలువంకలఁ దిలకించి యెచ్చటను గానక 'ఓ రాజా! వలదన్నను వెంటనంటితినని యా? నన్నిట్లొంటరిగ వీడిపోయితివి? ఈదారుణకాననంబుల నాకేమిదిక్కు? ఎన్నఁడును నాయామును వీడిచరింపని మహానుభావుండవుకదా. నేఁడిట్లు సేయుటతగునా? భీతినొందవలదని, తొలినుడివిన నుడువులేరీతి మఱపునకువచ్చెను? లేక మఱచి నిద్రించితినని యీ యలుకవహించుట? నాయీయరణ్య రోదనమాలించువారెవ్వరు? నిజనాథుఁడే నిర్దయుఁడై వీడిన యబలయం దెవ్వరికిఁ గనికరముదయించును?

'హా వృక్షరాజములారా! నానాథునిఁ జూపి పుణ్యముఁ గట్టుకొనుఁడు. ఓ! వనదేవతలారా! నా ప్రాణేశునిఁ జూపుఁడు, మీరును నాయందిట్టి కాఠిన్యమూనుట కెట్టియపకృతులు సలి

పియుంటిని? ఏన్నెట్టి మహాపాతకము లాచరించితిని? ఒక్కరికిని గరుణరాదే. ఏమిసేయుదానను? "

"ఓ తియ్యమామిడిచెట్టా! నాయిష్టసహకారు, నలభూపాలునిఁగాంచియుండలేదా? ఓ! తిలకవృక్షమా! భూలోకమునకుఁ దిలకమువంటి నలునిజాడ నెఱుఁగవా? ఓ! చందనతరువా! పండితులపాలిటి చందనమువంటి నలమహారాజునుజూడలేదా? ఓ! యశోకవృక్షమా! శోకములహరింపఁ జేయునలుఁడెటనుండెనో తెలుపవా? ఓ వకుళరాజమా! వంశమునకు దీపమువంటివాఁడును, భయమందిన శత్రునృపుల భీతినిబోగొట్టువాఁడునగు నలుని తెలిసికొనియుండలేదా?" అని చెట్టుచెట్టునకుఁ బోయియడుగును. ఎండవేమిచేఁ గాళ్లుబొబ్బలెక్కఁ జెట్లనీడల నిలుచును.

అట్లుదుఃఖించుచుఁ బోవుచున్న యాదమయంతి యొక పన్నగము, పట్ట, శోకాకులచిత్తయై హా! నాథా. యీయాపత్కాలమందైన నా మొఱాలించి నన్నుఁ గావవా? అవసానకాలమునందుఁ గూడనిన్నుఁ గనులారఁ గాంచుభాగ్యము లేకపోయెనుగదా! ఓ! పన్నగరాజమా. నామనోనాథుఁడును, నలుని, గాంచావలనైన నన్ను విడువుము. అయ్యో? నీకును విరోధినైతినా? "

హా! భగవానుఁడా, యీదీనురాలినిఁ బ్రోవుము. ఈ ప్రపంచంబెవ్వనిచే సృష్టింపఁ బడెనో, యెవ్వనిమాయచేనిం

డి కపటనాట్యము జరుపఁబడుచుండెనో, భక్తపరాధీనుఁడని యెవ్వఁడు బిరుదు వహించెనో, యార్తరక్షకుఁడని యెవ్వఁడొప్పునో యాదేవదేవుఁడు నన్నురక్షించుఁగాత,

అనివిలపించుచుండ, నావిలాపము నొకబోయవిని, యొక్కపరుగున నటకేతెంచి, తనచేతనున్న ఖడ్గమున నావన్నగశిరమునుదునుమాడ, రాహుముక్తయగు చంద్రరేఖయుఁబోలె నాదమయంతి యావిషసర్పము నోటినుండి వెలువడి యాతనినెంతయో కొనియాడెను.

ఆబోయవాఁడా దమయంతి సోయగంబునుగాంచి, మన్మథబాణంబులఁజిక్కి, యున్మత్తుఁడై, యొడలెఱుఁగక, పవిత్రచరిత్రయగు నాపతివ్రతాతిలకమునుగోరి, తనమనోవాంఛ నాపెకెఱిఁగించెను.

అందులకాయువతీరత్నము తనప్రాణదాతయగు వానిదుష్టబుద్ధిని లెక్కింపక అయ్యా! యీవునాకుఁ బ్రాణదానమొసర్చినవాఁడనగుటచేఁ బితృతుల్యుఁడవు. నన్నుఁబుత్రికాభావమున మన్నింపఁ నీబుద్ధినిమరల్చుకొనుము. అని కోరెను.

కాని, యాబుద్ధిలేని కఱకుటెఱుకుఁ మదనానలంబు సహింపనోపక యాదమయంతిని బలిమిని బట్టనెంచెను. ఎన్నివిధములనీతులఁ గఱపినను, వినకుండ మోహపాశబద్ధుఁడైనయాబోయవానినిఁగాంచి ప్రాణదాతయైనను మానమును గాపాడుకొనఁదగు సమయముగుటఁబట్టిఁ ఏనెల్లవేళల యాపత

నాప్రాణేశ్వరుఁడగు నలుఁడే దైవముగ మదిఁదలఁపోయుచుంటినేని, యేనే పతివ్రతనైతినేని యీకిరాతుఁడు మృతినొందును గాక" యని శాపమీయ, నగ్నిచే దహింపఁ బడినవృక్షముకైవడి, విగతజీవుఁడై నేలఁగూలెను.

తదనంతర మాదమయంతి, పతివ్రతాత్వప్రభావమున నాముప్పును దప్పించుకొని, మృగపన్నగభయంబునకు వగవక, తననాథు నసహాయత్వమును మాత్రము చింతనొందుచుఁ బోవనారంభించెను.

ఆఱవప్రకరణము.

పోవఁబోవఁ గొంతదూరమున, నాకులను భుజించియు, గాలిని భక్షించుచును, నీటిని ద్రావియు, తరువుల మొదళ్లను నివాసమేర్పఱచుకొని, తపంబొనర్చు కొందఱు మునులఁ గాంచి, దమయంతి, వారియెడ కేగి, భక్తివినయంబుల వారికి మ్రొక్కి "అయ్యా! నలభూపాలు డీమార్గమున నేతెంచి, మీకు వందనములనర్పించి యాశీర్వాదములఁ బడసెనా? వానిఁజాడ నెఱుంగుదురేని సెలవిండు. అతనిదర్శనము కానినాఁడుఁ విగతజీవనగుటయే కర్తవ్యమని నిశ్చయించుకొంటి" యని ప్రార్థించెను.

అంతలా మునిసత్తము లాపెయెడ మిక్కుటంబగు మక్కువఁ గలవారై "అమ్మా! దివ్యదృష్టిని నీచరిత మంతయుఁ

దెలిసికొంటిమి. కొలఁదిదినములలోనె సీవానలునిఁగూడి యెప్పటియట్టుల రాజ్యసుఖములఁ దేలతూఁగుచుండఁ గాంచగల్గుదువు” అనిమాత్రమునుడివి తమతపోవనంబులో నంతర్థానము నొందనదికలయో యిక్కమోయని తడఁబడి యాదమయంతి యాఋషీశ్వరుల పల్కులనే తలఁచుచుఁ గొలఁదికాలంబున దప్పక తనప్రియునిఁగూడి సుఖింపగలనని నిశ్చితమానసురాలై తనప్రాణేశ్వరుని నామమే మదినిస్మరించుచు బయలుదేఱెను.

పిదప నొకనాఁటి రాత్రికాలమున, నొకసరోవర ప్రాంతమునకుఁ బోవఁబవలెల్లఁ బయనమాచరించి, విశ్రమించియున్న బిడారులఁ గొందఱఁ గాంచి, వారేపట్టణమునకుఁ బోవువారలో దెలిసికొననెంచి, వారిదరిఁ జేరఁ బోయెను.

ఆసార్థవాహులును, భూశయ్యనుబవ్వళించుటచే నెంతయుబిఱుసు నొందియున్న శిరోజములు గలిగినట్టియుఁ గఱుమాసినయర్ధవస్త్రధారిణియు, నున్మాదినివలెనున్న దమయంతినిఁ జూచి, కొండఱుపిశాచంబనియుఁ గొందఱువనదేవతయనియు భయమందిరి. కొందఱు దేవతావనితయని నమస్కరించిరి.

వారిభీతినిఁ బోగొట్టవలెననుతలంపు దమయంతి మృదువాక్యముల ‘ నయ్యా ! యేనుబుణ్యపురుషుండును నిత్యసత్యవ్రతాచరితుఁడును శత్రువులచేఁ గూడ బొగడఁబడువాఁడునగు నలభూపాలునిభార్యను.

దమయంతి యనువాఁడను. విధివశంబున నానాథుఁడు స కలైశ్వర్యముల జూదమునందు గోలుపోవ నీకాననముల కే తెంచితిమి. పిమ్మట నాఁకటిబాధకోర్వఁజాలక యొక్కచో మ అది నిద్రింప నేకతంబువనో నామనోహరుఁడగు నలుఁడు న న్నొంటిరిగవిడి యెక్కడకో పోయెను. వానిజాడఁ దెలియుదు రేని కృపాంతఃకరణులై తెలిపి పుణ్యముఁగట్టుకొనుఁడు" అని నిజవృత్తాంతమంతయు విశదపఱచెను.

వా రాబిడనెంతయు గౌరవమున నాదరించి "అమ్మా! యీయరణ్యాటవుల సింహంబులను మదపుటేనుఁగులను పులు లను దఱుముగఁగాంచుచుందుము మే కాని నరులనెన్నఁడును జూడ ము!" అనియుత్తరమిచ్చిరి.

ద—మీరిటనుండి యెచ్చటికేగుదురు?

అందులకా సార్థవాహాధ్యక్షుఁడు "మానివాసమగు చే దిపురమునకుఁబోదు" మనెను.

ద—నేనును మీవెంటరానగునా?

"తల్లీ! తప్పక దయసేయుము. తెల్లవారుజామున నే బయలుదేఱుదము.

ఈరీతిఁ గొంతకాలము సంభాషించినపిదప దమయం తియు నొక్కచో విశ్రమించెను.

రెండుయామములైనవెనుక నీటికై యాకాసారమున కుఁ గొన్నిగజములే తెంచి నిద్రాపరవశులైయున్న నాబిడారు

లఁ గొందఱఁ గాలిత్రొక్కుళ్లచేఁ జంపెను. కొందఱు భిన్నాంగులైరి. కొందఱు ప్రాణభీతిచే నటునిటు పరుగిడఁ దొడఁగిరి. ఆ సందడిచే దమయంతియు మిక్కిలి విగతజీవులైనట్టియు నేలఁ గడలకుఁ బారినట్టియు సార్థవాహులఁ గని విచారమందుచు 'అయ్యో! ప్రాణములపైఁ దీపివదలి మృత్యుదేవతకెరయగుటకు సిద్ధముగనున్న నన్నుఁ జంపక యీకరులగుంపు మందమతిని సుఖసుప్తులైనిద్రించుచున్న వీరలఁ జంపెనుగదా" యనితలంచెను.

హతశేషులైనవారిఁ గూడి దమయంతి మఱుచటి దినమున నడచినడచి చేదిపురమును జేరెను.

ఆనాఁటిసంధ్యాసమయమున రాజమాత సౌధోపరిభాగమున నున్నతఱి సునందయను నొకదాసినిఁ జేరఁబిలిచి "ఎవ్వతెయో యొకవనిత జీర్ణమైనట్టియుఁ గడుమాసినట్టియుఁ జీరనుగట్టి దుమ్ముచేనిండిన శిరోజముల వ్రేలాడవైచుకొని యున్మాదినివేసమును బూనిన లచ్చివలె నిటువచ్చుచున్నది. చూచితివా? ఏలొకో నాకామెయం దెంతయు మక్కువకల్గినది. తోడనే నీవుపోయి యాబిడను దోడ్కొని రమ్మ" ని యాజ్ఞాపింప నదియుఁ గడురయంబున నామెచెంతకేగి యవ్వార్త జెప్పి దమయంతిని రాజమాతయొద్దకుఁ దోడ్కొని పోయెను.

"అమ్మా! నీవెవ్వరిదానవు? ఇట్లేల యున్మాదినివైవెడి వీధులవెంబడి తిరుగుచుంటివి? నీయుదంతమించుకయు దాపక సాంగముగఁ దెల్పుము తల్లీ."

"ఏను విధివశమున నిజనాథుఁ బాసి చరింపవలసినదాననైతిని." అని దుఃఖముచే నూరకుండుటఁ గాంచి యామె యే కారణంబుననో తనచరితము వెల్లడింప శంక నొందుచుండెనని రాజమాత యావల్కులవిని "నీవీనాఁడాదిగ నాయొద్దనుండుము. నీనాథుని వెదుక విప్రోత్తములఁ బనిచెద" ననెను.

ద—ఏను సైరంధ్రీవ్రతమును బూనియుండ నెంచితిని. ఉచ్ఛిష్టాన్నములభుజియింపను పరపురుషులతోఁ బలుకనోపను. నాప్రాణేశ్వరుని వెదుకఁజను బ్రాహ్మణులతో మాత్రము మాటలాడుదును. అట్లయిన నీయొద్దనుందును. లేకున్న నాదారి నేగుదును.

ఆపల్కులకెంతయు సంతసించి రాజమాత యామెయిచ్ఛవచ్చినట్లు వర్తింపుమని నుడువ దమయంతి చేదిపురమున నుండి పుష్పమాలికలఁ గట్టుచు మంచిగంధమును దీయుచుఁ బతి నెల్లవేళల మదిఁదలఁచుచు నాతని నెన్నఁడు చేరగల్గుదునో యని కుందుచు నతికష్టముతోఁ గాలముఁ బుచ్చుచుండెను.

ఇట్లుండ నొకనాఁడామె చందనగంధమును దీయుచుండ నొకదాసి యటకేతెంచి "ఏమే! యిదియే నా యింతవఱకును నీవుతీసినగంధము. సరుకు రాను రానుగర్వమతిశయించుచున్నది. రాజమాత నిన్నెంతయుఁ బ్రేమించుచున్నదిగదా యని పొంగిపోవుచుంటివి. చూడుము. నిన్ను వెడలనడుపు టొక్కక్షణము" నెను

ద — అమ్మా! ఏల కోపపడెదవు? శక్తి కొలంది పని చేయుచుంటినే కాని యూరకుండుట లేదు. దుఃఖముచే నశక్తురాలనగుచుంటిని. అంతియే కాని నాకేమిగర్వము?

దా — ఏమి? ఇంత శుభకార్యములు జరుగుచుండ నీకు దుఃఖమా? సిబ్బిదుకే దుఃఖము.

ద — ఏల తూలనాడెదవు? ఎటులనో జీవనములం బాయనోపక బ్రతుకుచుండ నాకీ నిష్ఠురోక్తు లేల?

ఆదాసి యటనుండి వెడలినం బిమ్మట దమయంతి తన పని నెరవేర్చుకొనుచు "ఆహా! నేఁడేలొకో నా యెడమకన్న దురుచున్నది. అందువలన శుభదాయకంబనియు శకునం బయన మొనగూడునవియుఁ జెప్పుదురు. నాకా శుభములు చేకూరుట కల్లయే కాని యింతకుమున్నా వాదాసి నుడివినట్లు నాపనిఁ బూర్తి చేయకున్న నిటనుండి తరుమఁగొట్టబడుట నిక్కము" అని చింతింప మొదలిడెను.

ఎందఱెందఱో దాసీజనముండి యూడిగములొనర్పను ఉండెడు వనిత నేఁడు తానొక దాసియై చరించుచుండెనుగదా. విధివ్రాత దాట నెవరికి వశమగును?

ఆదినమున నా చేదిపురరాజునకుఁ బుత్రోదయమగుటచే నా శుభమును జరిగింపఁ బురోహితు లంతఃపురమునఁ జొచ్చు వేళ నొక నూతన విప్రుఁడు కూడ వారివెంట నేఁగి దమయంతిం దిలకించి యానవాలు పట్టి కన్నుల నీరు నింపుచు "అమ్మా! ద

మయంతీ! ఏమినా పుణ్యము? ఏను సుదేవుఁడను బ్రాహ్మణుండ. నీజనకునిచేఁ బంపఁబడి దేశములన్నియుఁ జుట్టివచ్చి కడకు నాయదృష్టవశమున నిన్నిటఁ గన్నులపండువగఁ గంటిని. తల్లీ! ఇంతదనుక నెట్టి పడరాని యిడుమలఁబడియుంటివో కదా! ఇచ్చటి కెట్లు రాగల్గితివి? నీనాథుఁడౌ నలరాజెందున్నవాఁడు? వీనిలో నొక్కటియును దాచక తెల్పుమమ్మా" అనియడిగెను.

ఆపల్కులాలించినంతనే దమయంతి శోకాకులచిత్తయై దుఃఖమువాపఁజాలక క్రిందపడి మూర్ఛాగతురాలయ్యెను. అంతకని యొకదాసి పరుగిడుచుఁబోయి రాజమాతకా వార్త నెఱింగింప నాపె కడురయంబున నచ్చోటును జేరి యుపచారంబుల మూర్ఛనుండి విముక్తురాలగునట్లొనర్చి యావిప్రునిఁగాంచి యాకాంత యుదంతమేమని యడిగెను.

ప—అమ్మా! ఈబిడ విదర్భరాజనందనయగు దమయంతీదేవి.

రా—మీరెట్లు గ్రహింపఁగల్గితిరి?

ప—ఈపెకనుబొమలనడుమ ధూళిచేఁ గప్పఁబడిన నొకపుట్టుమచ్చ కలదు. దానిచేఁ దెలిసికొంటిని.

తోడనే రాజమాత దమయంతిని గాఢాలింగనమొనర్చి మోమును నీటిచే శుభ్రమొనర్చి యానవాలునుఁగాంచి "బిడ్డా! దమయంతీ! నీజననియు నేనును దశార్ణరాజపుత్రి

కలము. ఏనీచేదిపురాధీశుఁడగు వీరసేనునకుఁ బత్నినైతిని. ఆమె భీమరాజునకొసంగబడెను. ఇంతదనుక నీచరితముచుగన నైతినిగదా" యని యత్యాదరముగ నుడువుచుఁ గొంతకాలమటనుండ వేడెను.

ద—అమ్మా! నాజననిజనకులను బిడ్డలను నెడబాసి చిరకాలమగుటచే నిఁకఁదడయఁజాలను. దయయుంచి నాకు సెలవొసంగుము.

అని యాపెయొద్ద సెలవుఁ గైకొని విదర్భ కేగి బంధుజనులకెల్ల నాహ్లాదమును గొల్పెను.

భీముఁడానాఁడాదిగ నల్లుని యెడబాటున కెంతయుఁ గుందుచు నాతనినెఱిఁగి వచ్చువారికి గోసహస్రంబులను నగ్రహారంబులను నిత్తునని చాటఁబంచెను. సుదేవునిఁజీరి "ఆర్యా! తామెంతయుఁ గష్టమును జెంది తుదకెటులనో నాముద్దులపుత్రికను నాదరిఁ జేర్చి సంతసమొందఁజేసిరి. కాని నామనంబించుకయుఁ గుదురుచెందుట లేదు. అనలమహారాజునుగూడ దమయంతినిఁగనుఁగొన్నరీతిని తెలిసికొని తోడ్కొనిరండు. రానినాఁడు వానియుదంతమైన నెఱిఁగివచ్చి మాకెల్లరకు నుల్లాసమును గలుగఁజేయుఁడ" ని ప్రార్థించెను.

ఏడవ ప్రకరణము.

కలిప్రేరేపణచే నలుఁడు సహజమగు గుణములలో నొకటియగుఁ గరుణనువీడి నిర్దయుఁడై దమయంతి వస్త్రార్ధనిక ర్తనంబొనర్చి తనకుఁ బరిధానముగఁ జేసికొని వ్యాకుల హృద యుఁడై నిజపత్నినివిడనాడి యొంటరిగ సంచరింపఁ దొడఁగెను.

తొలుత నారీతిఁ గావించియుండెనేకాని కొంతదూరమే గిన వెనుక 'ఆహా! ఏనెట్టికఠినాత్ముఁడనైనై నాయందలి ప్రేమా తిరేకంబునఁ . . దండ్రులకడకైనఁ బోవక నన్నే యాధారము నెంచి ఘోరకాననంబులకు వెంటనంటివచ్చినఁ బతివ్రతయు నబలయునగు ధర్మపత్ని నొంటరిగ వీడితిని. నిద్రనుండి మే ల్కాంచి నన్నుఁగానక విలపించుచు నెట్లుదూషించియుండు నో? ఇంకను దొలిఁజేసిన పాపకర్మానుఫలమనుభవింప నీరీతిగఁ బరిణమించెనుగాఁబోలును."

"అయ్యో! ప్రాణేశ్వరీ! రాజాధిరాజునని నీజననీజన కులుతలఁచి నీవెంతయో సుఖించెదవని నాకొసఁగి పరిణయ మాచరించిరి. కాని యిట్లు హతభాగ్యుఁడనగుదునని తెలిసి యుండిన నింకొకరాజపుత్రునకొసంగియుందురుకదా. నిన్ను కనిమిషమైన విడనాడకుందునని దృఢప్రతిజ్ఞనొనర్చియు నెర వేర్చ సతిని గాపాడుకొనఁజాలనివాఁడనైతిని. నీతలిదండ్రు లీ

వార్తనువినినఁ గఠినహృదయుఁడనని నన్నెంత దూరుచుండునో ! ఏమి సేయువాఁడ ? విధివశంబున నిట్టిబుద్ధి వొడమెను. ఏమైనను నాసుగుణాలవాసిని ధర్మపత్నిని దమయంతిని విడచిచనింపనోప ” నని పరిపరివిధముల దుఃఖించుచుఁ దిరుగ నామెను వీడివచ్చినచోటికరిగెను.

కాని యట దమయంతినిఁగానక యేక్రూరమృగముల కెరయయ్యెనో? దుర్మార్గులెవరైన మోసగించికొనిపోయిరో? లేక పతియే నిర్దయాత్ముఁడై కఠినత్వమూని వదలియుండ నీకేఁబ్రిదుకని బలాత్కారమున నసువులఁబాసియుండెనో? యని సంశయాకులాత్ముఁడై యేమిసేయుటకుఁ దోఁపక యటునిటు తిచలించినవానిభంగి తిరుగుచుఁ బోవ సమకట్టెను.

అట్లేగుచున్న నలునకుఁ గావు కావు మనుచు నొక యార్తనాదము చెవిసోఁక నదేమని తత్తరపడుచు దీనసంరక్షణాసక్తుఁడును, శరణాగతవత్సలుఁడునగు నలభూపాలుఁడు నలువంకలఁ బరికింపఁ జూడ, నొక్కచో ఘోరాగ్నిజ్వాలలు మిన్నుముట్టుచు దిక్కులఁ జుట్టుకొన నానడుమ నొక సర్పముండి “అయ్యో! యీదారుణాగ్నిచేఁ జుట్టఁబడి కొలఁదినిమిషముల మేనువాయ సిద్ధముగనుంటిని. నన్నుఁ గాపాడి పుణ్యముఁ గట్టుకొనుము” అని దీనాలాపములఁ బ్రార్థింప నాతఁడొకింతయుఁ గాలయాపనము సేయక దానినెత్తి యావలకువచ్చి వదలువేళ నదియింకను బదియడుగుల దూరము నడువుమనె న.

నడుగుల నెన్నుకొనుచుఁ బదియవయడుగున, నాపాముచే దష్టుండై వికృతరూపమునొంది చింతిల నారంభించెను. అంతనలున కాపన్నగము "రాజా! నాచేఁ గఱవఁబడితివని విచారపడకుము. ఏను గర్కోటకుండను వాఁడ; నీ విప్పుడిట్లగుటచే నెవరికిఁ దెలియక క్షుత్పిపాసలకు దూరుఁడవై క్రూరమృగపిశాచముల వలని భయంబులేక సుఖముగ నుందువు. నీవిటనుండి పోయి, యయోధ్య నేలు ఋతుపర్ణుఁడను రాజు నాశ్రయించి యాతని దయకుఁ బాత్రుఁడవు కమ్ము. శుభ మొనగూడును గాక" యని చెప్పి మరల "నీ కెన్నఁడు నిజరూపమును గొననిచ్ఛయించునో యప్పుడు నన్నుఁ దలఁతువేని యీవస్త్రము నీయొద్దకు వచ్చును. దానిని ధరించెదవేని యొకప్పటి రూపము నందఁగలవని చెప్పిపోవుచుండ నలుఁడు "ఆర్యా! దమయంతి జీవించియున్నదేమో తెలిపి నన్ను సంతుష్టాంతరంగునిగ నొనర్పు" మన నాకర్కోటకుఁ డిఁక నేమియుఁ జెప్పఁదగదు. అట్లొనర్చితినేని శాపదగ్ధుఁడనగుదు, నని తెలిపి యంతర్ధానము నొందెను.

అంత నానలుఁడు రూపమునకుఁ దోడు నామమునుగూడ మార్చుకొని బాహుకుఁడను పేర ఋతుపర్ణునిఁ జేరఁబోయెను. అంతవఱకును మిక్కుటంబుగ బాధింపుచున్న నాఁకటి బాధయునగంటి యితర చింతలు లేక దమయంతీవియోగమునకు మాత్రము కుందుచుండెను.

బాహుకుఁడు ఋతుపర్ణునొద్దఁ జేరి "ఋతుపర్ణరాజా!

యేను నీయొద్ద వంటలవాఁడనై కొంతకాలము వసింపనిచ్చుటకై యిట కేతెంచితిని.

కరుణార్ద్రహృదయుఁడవై చేరఁదీయుము. అశ్వశిక్షను గూడ నేర్చియుంటిని. ఎట్టిగుఱ్ఱములనైన రథములకమర్చి కొలఁదికాలంబున ననేక యోజనములదూరమేగు నట్లొనర్పఁగలను." అనెను.

ఋ—నీనామమేమి ?

బా—బాహుకుఁడందురు.

రాజధర్మానుసారముగ ఋతుపర్ణుఁడందులకు సమ్మతించి "బాహుకా! యటులనే యుండనగును. నీవిద్యాపాటవమును జూపుచుండువుగాక! ఇంతవఱకెవరియొద్దనుండెడివాఁడవు?" అని ప్రశ్నించెను.

బా—నలమహారాజునొద్ద వంటలవాఁడనై యున్నాను. ఆతఁడు రాజ్యభ్రష్టుఁడై కాననముల కేగఁ దెలివెద్దియునుఁ గానక యీవును తత్తుల్యుఁడవని విని యుండుటచే నిట కేతెంచితిని.

పిదప ఋతుపర్ణుఁడు దగ్గరనేయున్న వార్ష్ణేయునిఁ జూచి "నీవీతని నెఱుఁగుదువా" యని యడిగెను.

వా—రాజా! నేనెంతయోకాలమునుండి నలరాజునొద్ద సారథినైయుంటినికాని, యీతని నెన్నఁడుఁ గాంచియుండ

లేదు. ఇదియుఁగాక వంటలవారిలో మాకేదిపని యుండును? ఈతఁడు నలునొద్ద వంటలవాఁడై యుండిన నుండవచ్చును.

రాజాధిరాజై లెక్కకు మిక్కుటంబగు సేవకులచే నూడిగములఁ జేయించుకొనుచుండి సుఖములఁబడయు మహానుభావుఁడు నేఁడు తానే యొకరాజునకు సేవకుఁడై యూడిగములఁ జేయవలసినవాఁడయ్యెను. ఆహా! కాలమహిమ నెవ్వరెన్నఁగలరు? ఏవేళనెట్టి యిడుములు ప్రాప్తించునో, యెప్పుడెట్టి సుఖములందనగునో యెవ్వరెఱుఁగుదురు? భూచక్రమునంతయు, నేకచ్ఛత్రము, బాలింపఁదగిన మహారాజు నేఁడొక వంటలవాఁడై చరింపవలసి వచ్చెను. ఏట్టివైపరీత్యము.

బాహుకుఁడును, నన్నియో చిత్రవిచిత్రములగు వంటలఁ జేయుచు నాఋతుపర్ణుని దయకుఁ బాత్రుఁడై వర్తింపుచుండెను.

ఒకానొకదినమున ఋతుపర్ణుఁడొంటరిగ నున్నవేళ నొకవిప్రుఁడేతెంచి యాతనివలనఁ దగురీతి సన్మానింపఁబడినపిదప వారిరువురీ రీతిని బ్రసంగించిరి.

ఋ—ఆర్యా! తమ నివాసం బెయ్యది?

వి—విదర్భాపురము. నా నామము సుదేవుఁడందురు. భీమభూపాలుఁడు నలురాజ్యభ్రంశంబువిని, కూఁతురునల్లుండె

టకేగికోయని పలుచోట్లకు నన్నుఁబోలు విప్రులను, యనేకులసేవకులనుఁ బంపెను. ఏనుఁ దిరిగి తిరిగి తుదకుఁ బుణ్యవశంబునఁ జేదిపురమునుజేరి యచ్చట భర్తనెడఁబాసి యొంటరినై సైరంధ్రీవ్రతమునఁ గాలముఁబుచ్చుచుఁ బ్రచ్ఛన్నవేషముతో భర్తృవియోగంబున దుఃఖాన్వితయు, శల్యావశిష్టయునగు దమయంతినిఁగాంచి యామె పుట్టినింటికిఁ జేర్చితిని.

రాజా ! నలునివంటి నిర్దయులెందైనఁ గలరా? అర్ధాంగియుఁ, బతియేదైవమని యెల్లవేళల మనంబున ధ్యానింపుచు నెట్టికష్టములు ప్రాప్తించినను, తృణప్రాయముగనెంచి పతినెడఁబాయుటకన్న బ్రాణములుబాయుటయే సుఖదాయకంబని తలపోసి ఘోరారణ్యంబులఁ దోడునీడయై చరించుచున్న వనితారత్నము మార్గాయాసంబున నొడలుమఱచి నిద్రించుతఱి వస్త్రమునర్ధంబుఁజించి పరిధానముగ నొనర్చుకొని వీడెడు వారెట్టిబుద్ధికుశలురు ?

ఋ—ఇందులకేమి యుత్తరమొసంగవలెనో తోఁపకున్నయది. పాప మానలమహారాజు దమయంతీద్వితీయుండై కాననంబుల నొంటరిగ సంచరించి కందమూలఫలంబు లాహారంబుగఁ గొని తాపసవృత్తి చరించుటయేగాక ధర్మపత్నినిఁగూడ విడచెనుగా? ఎంతటి ఘోరము? అనుపమానసౌందర్యశీలయగు నాసుకుమారి యానట్టడవుల నెట్లు తిరుగుచుండెనో?

సు—భూపాలా! వారియెడ బాటున కొంతయో కుం దుచు దమయంతియొక్క తలిదండ్రు లాహారమునైన ముట్టక ఖిన్నులగుచుండిరి. కడకు దమయంతినిఁ గాంచుటచే నొకింత తాళియుండిరి. లేకున్న నెట్టిఘోరము ప్రాప్తించి యుండు నో? ఇందుల కేమిగాని. నేవెదకినఁ బ్రశ్నకుత్తరము మీయొద్ద వంటలవాఁడైయున్న బాహుకుఁడే తెలుపసమర్థుఁడని తోఁచుచున్నది.

ఋతుపర్ణుఁడా బాహుకుని రావించి యా ప్రశ్న సందేశమును దెల్పెను.

బా— అందుల కేను మాత్రమెట్లు సమర్థుఁడనగుదు ను? అయినను మీరు ప్రశ్నించితిరి గాన నాకుఁ దెలిసినంతవ ఱకును నివేదింతును. అట్లు పత్నిని వీడుట కేదియో తగుహే తువుండవలెను. విధిప్రేరణనుదాట నెవరికి శక్యమగును? అది యునుఁగాక యాతఁడెట్టి యాపాలఁజిక్కి యుంటచేనట్లు విడ నాడి యుండెనో? మనమంతమాత్రముననే యధర్మమని దూషింపనగునా?

సు—ఇంకను సందియమందనేల? దారుణకాననంబు లఁ దనవెనువెంట వచ్చునొక యబలను గాపాడుకొనఁజాలని వాఁడెట్లు పరిణయమాడెను?

బా—కాపాడలేక వీడెనని యెట్లు చెప్పఁగలము? ఒక

వేళ నాపెనువదలినఁ దనబంధుగులయొద్దఁ జేరి సుఖించునని యెంచి యుండెనేమో !

సు—చాలుఁజాలు నీయుత్తరమెంతయు శోచనీయము. బంధుగుల కడ కేగునని ఘోరమృగనివాసంబగు నరణ్యముల వీడుటయా ? పాపమాసుదతి తననాథునిబాసిన దాదిగ నాహారము నైన ముట్టక కటిక నేలలఁబవ్వళించుచుఁద దేక ధ్యానంబున దినములలెక్కింపుచుఁగొలఁదికాలమునఁ బ్రాణేశుని దర్శనము కాకున్న జీవములఁబాయుటయే కర్తవ్యమని యెంచుచున్నది. ఆకాంతరోదనమాలించు వారెవ్వరు ?

ఋ—రాత్రి చాలయైనది. పండుకొందము. బాహుకా ! నీవిఁకపొమ్ము.

బాహుకునిచే నీయఁబడినఁ బ్రిత్యుత్తరమును గాంచిన సుదేవుఁడు తప్పక వికృతరూపధారుఁడగు నాతఁడే నలుఁడై యుండనోపునని యెంచి యింకను గొన్ని విషయముల గ్రహింపవలెనను తలఁపున బాహుకునిశయ్యాస్థలంబెఱిఁగి యేమియుఁ దెలియని వానివలె నచ్చోటఁ బరుండి నిదురఁజెందుచున్న చందమున నటించెను.

1958 - 9 - 26
1957 - 8 - 26.
దమయంతి
1 - 1 - 0 13

ఎనిమిదవ ప్రకరణము

సమయానుకూలముగఁ బ్రచ్ఛన్న వేషముననున్న యా నలమహారాజు, దమయంతీ వియోగానలంబున మ్రగ్గుచు, విరహా వేదనా పీడితుఁడై, తపియించుచు, నిండుచందురుని జూచి, సంతాప మంతకంతకు వృద్ధియగుటచే నిట్లుదూషింపసాగెను.

" శశీ ! ఈవు చల్లని కిరణజాలములు కలిగి, సకలజన మనోరంజకుఁడవని ప్రసిద్ధినొందు చుంటిననియా యీకార్యము ? నావంటి పాంథులెందఱు నినుదూషింపుచున్నను, యించుకయు లెక్కింపక, మఱింత తాపమును హెచ్చింపఁజేయుటయే నీకాసక్తి కాఁబోలును. నిన్నొక్కొక మాఱు రాహుకేతులు నోటఁగుఱ్ఱుకొనుచుండియు, మరలదయా స్వభావమున విడుచుందురు. లేకున్న నిట్టియిడుమలే లేకుండునుగదా. దీనులబాధించుటయే నీకునవ్వులాటవలెఁదోఁచునా ? ఆనాఁడు పార్వతి నీనవ్వులకుఁ దగిన శాపమొసంగియు వేల్పులయొక్క మొరలచే జాలినొంది నీకుట జ్ఞప్తియుండదుకొనుము. ఓరీ ! కలుషమతీ ! నిన్నానాఁడాత్రినేత్రుఁడు హాలాహలముతోఁగూడభక్షించియుండిన నావంటి విరహులకిట్టి పాట్లులేకుండునుగదా. నీమోమునఁ గళంకముండియు నాయట్టియందగాఁడు లేఁడనివిఱ్ఱవీగుటెంతటి నైచ్యము! అదియును లేకున్న నింక నెట్లు మిట్టి

పడుచుందువో! నిన్న ననేల ? పాపాత్ముఁడగు నామదముఁను
నీకుఁదోడు కాకున్న నింతటిశక్తి నీకెట్లు కల్గును ? ”

“ దమయంతీ ! మనయెడఁబాటేకదా యిన్నిటికిని
మూలాధారమై నన్ని న్నిరీతుల వ్యర్థునిగఁజేయుచున్నది. ఏనె
ట్టిదుఃఖమును బాపుకొనఁజాలువాఁడ ? నాయట్టిదురదృష్టహీ
నునికి సుఖమెట్లలవడును ? ప్రాణేశ్వరీ ! నావలెనే నీవెట్టియి
క్కట్టులఁ జిక్కి తపియించుచుంటివో ? తరుణీ! నీసాహాయ్య
మే యుండిన నేనెట్టిధన్యత నొందియుందును ? ”

అనియిట్లువిలపించువేళ నంతదనుక నిద్రించుచున్న వా
ర్ష్ణేయుఁడు మేలుకువఁగల్గి “యీతనిరూపముఁజూడఁ గడున
సహ్యమైకన్పట్టుచుండె, నిఁక నీతనిచే వరింపఁబడిన నావనితా
సౌందర్య మెటులుండెనో ? బాహుకా ! నీవలచిన నాకాంత
యెవ్వరని ” యడిగెను.

బా—వార్ష్ణేయా ! నీవుమేల్కాంచి యెంతకాలమై
నది ?

వా—ఇప్పుడే మేల్కనియుంటిని.

బా—నాకొకభార్యయే తక్కువాయెనా ? గ్రంథా
న్వితముగు నిది యొకపురుషుఁడు తనలలితాంగిని బాసినవేళ వి
లపించిన విలాపము. దానిననుసరించితిని.

వార్ష్ణేయుఁడును నాద్యంతములగ్రహించి, తప్పకయాతఁ

డే నలుఁడని కృతనిశ్చయుఁడై యావృత్తాంతము భీమునకుఁ దెలుప విదర్భ కేగెను.

ఆతని సందేశము నంతయు నరసి భీముఁడు "విప్రోత్తమా! మీరు మాపాలిటి భాగ్యదేవతవలెఁ గాన్పించుచున్నారు. ఏకపటోపాయంబుననో యాతని నిటకుఁ దోడ్కొనిరావలయునే కాని లేకున్న నాతఁ డందుల కొడంబడుననుట యసత్యము. ఏమి సేయుటకుఁ దోఁచదయ్యె.

సు—రాజా! యిందులకింతగ యోచింపనేల? ఏనొక యుపాయమాలోచించితిని. కాని, మీరందుల కాగ్రహించెదరేమోయని శంక నొందుచున్నాఁడను.

భీ—అదేమియో తెల్పి నన్ని చింతలనుండి తొలఁగింప యత్నించు మిమ్ములఁ గొనియాడుటకు మాఱు కినుకఁ బూనుటయా?

సు—అటులైన నాలకింపుఁడు "దమయంతిని నట్టడవుల విడిపోయిన నలునిజాడఁ దెలియకుండుటచే, నామెకు ద్వితీయ స్వయంవర"మని ఋతుపర్ణున కొక లేఖ నంపిన నన్నియు సానుకూలమగును.

భీ—హరి హరీ! ఎట్టిమాటలు వినవయ్యెను. నిష్కళంకమగు వంశమునకిట్టి కళంకమొనగూర్చి యెట్లు భరింపఁగలను? పతివ్రతాశిరోమణియగు నాముద్దులపట్టికీ వార్తఁ దెలిపిన నసువుల విడకుండునా?

సు—ఈరీతి మొనర్చుకున్న, నాతనిరావించుటయే సర్ల భము. మీపుత్రికనిటకుఁ బిలిపింపుఁడు. ఆపెయునుమతి ననుస రించియే యాచరించుదము. తదనంతరము భీమరాజు దమ యంతిని రావించి "అమ్మా! నీమనోనాయకుండగు నలరా జు ప్రచ్ఛన్నవేషమున ఋతుపర్ణునొద్ద వంటలవాఁడై యుండె నని యీతఁడుచెప్పుచుండెను." అని మోమువంచి యూర కుండెను.

ద—జనకా! ఏనాతనికడకేగి వేడుకొందును.

సు—అట్లుకాదమ్మా! ఇందులకొక యుక్తినిబన్నితిని. అందులకీవొడంబడకతప్పదు. కార్యానుకూలమున కెన్నికపటో పాయములనైనఁ బన్నవలెను. నలుఁడు కానరాకుండుటచే, ద మయంతికి ద్వితీయస్వయంవరము నెరవేర్పఁబడునని, ఋతుప ర్ణునకు వార్తనంపవలెను.

ద—హా! యెట్టిదారుణకృత్యముల కొడికట్టవలసిన కాలమాసన్నమయ్యెను! భగవానుఁడా! యీదీనురాలిని ర క్షించుభారము నీయదే. రాజ్యభ్రష్టులమై ఘోరవనంబుల క్షు త్పిపాసాశ్రమంబులకు లోనై పొందరానిదుఃఖములఁ బొంది తిమి. తుదకుఁ బ్రాణనాథునిఁబాసి చరించవలసిన దౌర్భాగ్య దశప్రాప్తించెను. పాతివ్రత్యమే యిహ పరలోకసాధనమని తలఁచి వర్తించు నాకు నేఁడు ద్వితీయస్వయంవరమనుమాట వినవయ్యెనుగదా. హా! హతవిధీ!

సు—దేవీ ! నీభర్త చింతిలుచుండిన నేనీప్రయోజనము ? సమయానుకూలముగఁ బ్రవర్తింపవలెను.

పిమ్మట దమయంతి యెంతయు ఖిన్నురాలై కడకుఁ దననాథునిఁగూడు భాగ్యముబ్బునని యెడు యాసతో నందులకొడంబడవలసినదాయెను.

సుదేవుఁడును జాగొనర్పక భీముని చేవ్రాలుతో నొక జాబును వ్రాయించుకొని, యయోధ్యకుఁ బోయి, ఋతుపర్ణున కా లేఖ నందిచ్చెను.

ఋతుపర్ణుఁడు సుదేవుని మాయఁ గ్రహింప నేరక యాతని యనుమతిని బాహుకుని రావించి యా జాబును జదువనాజ్ఞాపింప నాతఁడు దానిని జూడఁగనే కనులనుండి బాష్పజలము ప్రవహింపఁదొడఁగి, యొడలు కంపింప నోటమాట వెడలకుండుటచే నేదియో కతంబునఁ దనకానాఁడు మనంబు కుదురు లేదని చెప్పి పొంగిపొరలి వచ్చు దుఃఖము నాపనశక్తుఁడై యట నుండి కదలిపోయి దమయంతిని దలఁచి శోకింప నారంభించెను.

“ కటకటా ! నేఁ డెట్టి కర్ణకఠోరములగు పల్కులు వినవలసి వచ్చెను ? పతివ్రతాతిలకమని ప్రసిద్ధివడసిన దమయంతి యిరువుర బిడ్డలఁగని మోహాంధకారమునఁ దగుల్కొని యింకొకనిఁ జేపట్ట నిశ్చయించెనుగా ! పాపము శమించునుగాక. ఈ లేఖనంతయుఁ దిలకింప మిగుల చోద్యముగ నున్నది. వ్రాత్య

మాసమున వివాహముహూర్తములుండునా ? ఇవియుం గాక, మూర్ఖత్వమధికదా! ఇదంతయుం గల్లయని తోంచుచున్నది. ఏమి నామందబుద్ధి ! భీముని చేవ్రాలిం దుండ నీజాబు వట్టిదెట్లగును ? ఎవనిచే వ్రాయంబడెను ? ఋతుపర్ణునంత వానికి యసత్యములగు వార్తలంపి హాస్యమొనర్చునా ? అట్టిస్వయంవరములకిట్టి ముహూర్తములే తగియుండును గాంబోలును. "

" హా ! ప్రాణేశ్వరీ ! ఏమంకను బొరబడుచుంటిని. ద్వితీయస్వయంవరమున నింకొకనిం జేపట్ట నుద్యుక్తురాలవైయుండం బ్రాణేశ్వరీయని యెట్లు సంబోధింతును ? హా ! దమయంతీ ! నిన్ను నట్టడవుల విడిచితిననియా యలిగి యందులకుం దగినం బ్రాయశ్చిత్త మిదియని చేయుటకు సిద్ధమైతివి ? మనముద్దులబిడ్డల నైన నదిలింపవైతివి వారినేమి సేయందలంచితివి ? తుచ్ఛమగు సుఖముల కాసించి యిహమే శాశ్వతమని నమ్మి యెట్టి నిందాస్పదమగు కృత్యమును జేయం దలపెట్టితివి. తొలుత నన్నుమనంబున వరించి దేవతలనుగూడం జేపట్టనిష్టపడకుంటివి గాదె. అట్టిసద్బుద్ధి నేండెట్లు మారియుండెను ? ఆనాండు నేను సర్వస్వహీనుండనై కానలయందు కరుగుచు నిజనివాసములకడకుం బొమ్మని యెంత వేడినను వినక, నా వెంటనంట లేదా ? ఈనాండవన్నియు మఱచితివా ? ఇంతకును నాదురదృష్టదేవత యిట్లొనర్చుచుండ నిన్ననసేల ? "

" ఈస్వయంవరమునకు ఋతుపర్ణుండు నన్నేల రమ్మని

యాజ్ఞాపింపవలె! ఏనెట్లా విదర్భకేగి నాధర్మపత్ని, నేఁడు వేఱొక పురుషుని వరించుట కనులఁగాంచి మనఁగలను? ఎంతయుసంకటమగుచున్నది. హా! విధాతా! నన్నేలసృజించితివి? రేపటిదినముననే స్వయంవరముకదా."

ఇట్లు నలుఁడు పరిపరివిధముల, శోకాంబుధిని మునిఁగి, యా రాత్రికాలమంతయు, నిదురనెఱుఁగక, వ్యాకులహృదయుఁడయ్యెను. దమయంతీప్రతిమయే కనులఁగాంచుచు, నానాను స్మరణమే చేయఁదొడఁగెను—

తొమ్మిదవ ప్రకరణము.

బాహుకుని సారథ్యనైపుణ్యమును గ్రహింపవేచియున్న, ఋతుపర్ణుఁడు విదర్భకుఁబోవ, రథమును సిద్ధపఱుప నాజ్ఞాపించెను. బాహుకుండును, కడుచిక్కి, శల్యావశిష్టములై యున్న నశ్వములనమర్చి, సిద్ధమొనర్ప ఋతుపర్ణుఁడు బాహుకా! సాయంకాలమునకు బహుయోజనంబుల దూరమున నున్న విదర్భాపురమును జేరవలయును. లేకున్న రేపటిస్వయంవరమున కెట్లుపోఁగలము. ఈగుఱ్ఱములంతదూరము కడు రయంబునఁ బోవనేర్చునే? అనెను.

బా—ఏనునశ్వహృదయమనువిద్యను నేర్చి యుంటిని. ఎట్టియశ్వములనైన ననాయాసముగఁ ద్వరితగమన మొనర్చు నట్లుచేయఁగలను. నాసామర్థ్యముఁ జూతురుగాక.

ఋ—అట్లైన నాకావిద్య నుపదేశించెదవా?

బా—మీయానతి నతిక్రమింపఁగలనా? అటులనే తెల్పెదను.

అట్లువారు పయన మొనర్చుచుఁ గొలఁదికాలముననే యనేకగ్రామములును బట్టణంబులును గాననములును జిట్టడవులను దాటి కడుదూరమరిగిరి. మార్గమధ్యమున నొక్కచో ఋతుపర్ణునిపైనున్న వస్త్రముజాఱ బాహుకా! రథగమనముం చుక తగ్గింపుము. వార్ష్ణేయుఁడుపోయి యాపుట్టమును గొని వచ్చునని నదిఁగొలఁగినచాది చాలదూర మేతెంచితిమి. కాన నసాధ్యమని బాహుకుఁ డుత్తర మిచ్చెను.

అందులకెంతయు నచ్చెరువంది ఋతుపర్ణుఁడు బాహుకునిఁ గొనియాడెను. వార్ష్ణేయుఁడు తానును సారథియై యగుటచే నించుక యవమానము నొందెను.

ఇంకను గొంతదూర మేగిన పిమ్మట ఋతుపర్ణుఁ డసంఖ్యాకములగు ఫలపత్రి సముదాయంబగు నొకవృక్షమును జూపి బాహుకుని రథమును నిలుపనాజ్ఞాపించి యిట్లనియె.

ఋ—ఈతరువుననున్న ఫలములను నాకులను లెక్కింపకయే సంఖ్యను దెలుపుదును.

అని వానిఁదెలుప బాహుకుఁడు వేర్వేరుగ వానిని లెక్కించి యత్యాశ్చర్యమున నదెట్లని యడిగెను.

ఇదిగో యక్షహృదయమను విద్య. దీనినెవ్వరు గ్రహింతురో వారు దుష్టగ్రహములవలని బాధలఁ బొందక యవ్యాకుల మనస్కులై యెల్లెడల జయమును గాంతురు."

బాహుకుఁడావిద్యను దనకుపదేశింపుమని కోరి గ్రహించి యంతదనుకనాతనియందు నివసించియున్న కలి ప్రాణమాత్రావశిష్టుఁడై విషముఁగ్రక్కుచుఁ జేతులఁజోడించి యెదుటనిలువఁ గ్రోధమూని శాపదగ్ధునిగ నొనరింతునని వల్కి పాకలివెఱచి మహాత్మా! యింతవఱకునుఁ గర్కోటకవిషంబుచే దహింపఁబడితిని. బుద్ధిమాంద్యమున సన్నావహించితిని. నన్ను క్షమించి శరణాగతవత్సలబిరుదమును నిర్వహింపుమని ప్రార్థింప నలుఁడును దయాపరుఁడై యాతని క్షమించి నన్నుఁగాని కర్కోటకునిఁగాని దమయంతినిఁగాని యెవ్వరు మనంబునఁ దలఁతురో వారినిఁ జేరకుండుమని యాజ్ఞాపించి వానిని వీడెను.

సాయంకాలమున కించను గొంతవ్యవధియుండఁగ నే రథము విదర్భపురినిఁజేరెను. ఆరథధ్వానమును విని దమయంతియు భీమరాజు మొదలగువారెల్ల నత్యంతానందము నొందసాగిరి.

పురప్రవేశమైన వెనుక భీమునిచేఁ దగురీతి నాహ్వానింపఁబడి ఋతుపర్ణుఁడు తనకు నియమింపఁబడినచోట విడిసెను.

మఱునాటిదినముననే స్వయంవరము జరుపు నుద్దేశించిన దినమయ్యును ఋతుపర్ణునితక్క నితరరాజు లెవ్వరును గానరాకుండిరి. పుర మలంకృతమే కాలేదు. అదిచూచి బాహుకుండు ఆహా! ఏమిది? స్వయంవర ప్రయత్నములేమియును గానవచ్చుటలేదు. దమయంతి తొల్లిటివలెనే మఱుమాఱున నెవ్వనినో వరించియుండునని యెఱిఁగి తమరాక నిరర్థకమని తక్కినరాకుమారులు రాకుండిరి కాఁబోలును? ఎచ్చటను శుభసూచక నినాదంబులుగాని యలంకారములుగాని కన్పట్టుటలేదు. ఇట్టులగుటకేమి హేతువు? కొలఁదికాల మూరటనొందియున్న నన్నియునుఁ దెలియును" అని యేమేమియో యోచించుచుండ దమయంతి దాసియొకతె యటకు నలుని పుత్త్రికను నింద్రసేనునిఁ దోడ్కొని యేతెంచి బాహుకునిఁగాంచి ఈవేనా, ఋతుపర్ణుని వంటవాఁడవని యడిగెను.

"అగును."

"నీపేరేమి?"

"బాహుకుఁడందురు."

"బాహుకా! నీవు చిత్రవిచిత్రములగు పదార్థములఁ జేయుదువఁట కాదా."

"చేతనగునంత చేయుదును. ఈబాలుఁ డెవ్వఁడు?

"దమయంతీదేవియొక్క ముద్దుపట్టియింద్రసేనుఁడు"

"నీవు దమయంతియొక్క దాసివా?"

"అగును"

"రేపటిదినముననే స్వయంవరము కాదా? అట్టియుత్నమేమియుఁ గనుపింపకుండుట కేమి హేతువు?"

"నలుఁడు వచ్చినఁగదా స్వయంవరము."

"ఆతఁ డెచ్చట నుండెను?"

"ఋతుపర్ణునొద్ద వంటలవాఁడై బాహుక నామంబున నిప్పుడిచ్చట నుండెనని యేనెట్లు చెప్పనేర్తును?"

"ఆహా! నీపరిహాసము లంతకంతకు హెచ్చుచున్నవి. ఇటనుండిపొమ్ము. పరపురుషులతో నీకేమిపని?"

"వంటలవారును పురుషులలోఁ బరిగణింపఁబడుదురా?"

బాహుకనామధారియగు నలుఁడు వికృతరూపము తక్క నితరబాధలనుండి విముక్తుఁడై యుండెను. తనపుత్రిని గనినదాది మోహపరవశుఁడై తాళఁజాలక నాతనిఁ జేరఁదీసి ముద్దిడుకొనెను.

ఇదంతయుఁగని యాదాసి జరగినవృత్తాంతమెల్ల దమయంతి కెఱింగింప తప్పక యాతఁడే నలుఁడని నిశ్చయించి తన జనకునికడకేగి యెట్లైన నాతనినిటకు రప్పింపుమనియు లేకున్న దానే యటకుఁ బోదుననియుఁ దెలుప నాభీమరాజు మఱునాఁడు ఋతుపర్ణుని బాహుకుని రావించి దమయంతీ సమేతుఁడై సభామంటపమును జేరెను.

అట్టితరుణమున ఋతుపర్ణుఁడు భీమునిఁజూచి రాజా!

స్వయంవరవ్యాజమున నన్నిట్లవమానింపందగునా? నేను నీకెట్టి యపకార మొనర్చియుంటిని. ఇట్టి యకారణ శత్రుత్వమున కేల పాల్పడితివని నిష్ఠురోక్తులం బలికెను.

భీ—ఋతుపర్ణరాజా! కొలదిదినిమిషములనన్నియు వెల్లడి యగును. విధివశంబున నీబాహుకుని రావింపయత్నించి యిట్లొనర్చితిని.

ఋ—ఈ బాహుకుం డెవ్వండు?

భీ—ప్రచ్ఛన్న వేషమున నున్న నలమహారాజు.

ఋ—ఏమి? ఈతండు నలభూపాలుండా?

భీ—అగును. నలసార్వభౌమా! నీవిట్లు నిర్దయుండవై యుండుటకు మేమొనర్చిన యపరాధము లేమి? నీకీవికృతరూప మెట్లొదవెను? నీవే నలుండవని దమయంతి నమ్మియున్నది. మాయందు వాత్సల్యతం జూపి నిజరూపమున నీమొగము జేకొమ్ము.

బా—ఋతుపర్ణరాజా! నీవుండియు నిట్లు పరిభవింప నూరకుండుట న్యాయమే?

ఋ—నాకేమియుం దోంచుటలేదు.

సు—నలభూపాలా! యింకను సంశయింప సమయమా? ఆనాఁడు నేవైచిన బ్రశ్నల కుత్తరమీయుటయు నారాత్రి యొక్కమారైన నిదురింపక దమయంతినింగూర్చి విలపించుటయు నెఱుంగంజాల ననుకొంటివా? ఇంతననేల?

నిన్నటిదినమున నొకదాసి యిందప్రసేనుని నీకడకుఁ దోడ్కొని రాఁగా నాతనిముద్దాడి యాతనివంటి పుత్రుఁడొకఁడుండెనని చెప్పియుండలేదా? ఇంకను నెట్టినిదర్శనములు కావలెను?

మహాత్మా! దమయంతీదేవినొకమాఱు చూడుము. ఎట్లు సాక్కుయున్నదో? నిన్నువీడినదాది భూస్థలిఁబవ్వళింపు చు హాఁటియర్ధవస్త్రమును వీడక యుండలేదా? ఇంకను సందియమందుచుంటివేల? నిజముగ ద్వితీయస్వయంవర మగునని యెంచితివా? ఈపన్నుగడకుఁ గారణభూతుఁడను నేనే. అదియే నిక్కమనితలఁచుటకు నీబుతుపర్ణుడుతక్క నితరరాజ నందను లెవ్వరైన నేతెంచిరా? పురమందట్టిప్రయత్నము లేమైనఁ గలవా? కావున మాతప్పులమన్నించి యనురక్తుఁడవు కమ్ము.

అయినను ప్రసన్నుఁడు కాకుండుటచే దమయంతి బాహుకుని పాదములమీఁది కొఱఁగి బాష్పధారలచే నాతని చరణములఁ దడుపుచు నాథా! యీదీనురాలిని దిలకించి రక్షింపుఁడు. నాకేమిదక్కుగలదు. నన్నింతనిర్దయబుద్ధివై వీడ నేనెట్టిపాతకము లాచరించితిని. ప్రాణేశ్వరా! నిన్నేదైవమని నమ్మిన నొకయబలను కరుణతోఁజూడక వీడుటపాడియా? ప్రాణప్రియా! రక్షింపుము. రక్షింపుము. లేకున్న నిదే ప్రాణ ముల వీడుదానను” అని కన్నులనశ్రుజలము కాలువలలై పాఱ దుఃఖించుచుండెను.

అంతనలుఁడును దుఃఖాక్రాంతుఁడై 'దమయంతీ! ద్వితీయస్వయంవరమున నెవ్వనిఁజెట్టబట్టనెంచితివో వానితోఁగూడి సుఖముండక వికృతరూపధారుఁడగు నలుఁడెందులకు?

ద—అయ్యో! నేనంత పాపాత్మురాలనని మీ రెంచితిరా? మీరాకకై యిట్టినీచపుకార్యమున కొడంబడితినే కాని కలనైనఁ బరపురుషుని మనంబున నెంతునా? ఇట్టి దుష్టురాలనగుదునేని యీభూమ్యాకాశంబులు నన్ను దహింపఁజేయవా? సర్వాంతర్యామివగు నోభగవానుఁడా! యేను దోషిణినో నిర్దోషిణినో నీకైనఁ దెలియదా? దోషిణియైనచో నన్ను మడియింపఁ జేయుము.

నలభూపాలా! నీపాదములయాన. నేనెట్టి దోసము నెఱుఁగనని మొక్కివక్కాణించుచున్నాను.

అట్టితఱి నాకాశవాణి యందఱు వినుచుండ దమయంతి నిర్దోషిణి దమయంతి నిర్దోషిణి యని మువ్మారుపల్కెను.

ఇంద్రసేనుఁడు జనకునికడకేగి నాయనా! మాయమ్మ నీవే నలుఁడవని ప్రార్థింపుచున్నది. నీవు నలుఁడవగుదువో కావో నేనెఱుఁగను. నిక్కముగ నలుఁడవేయైన నాజననికోర్కెఁ నెరవేర్పుమని ప్రార్థించెను.

ఇంచుకయుఁ దడయక, నలుఁడు కర్కోటకుని మనంబునఁ దలఁచిన, నొకవస్త్రము రాఁగా, దానిని ధరియించి, ని

జరూపమునొంది, యింద్రసేనుని గౌగిలించి, దమయంతికి జే రఁదీసి, యటనున్న వారికెల్ల నమితానందమునుగొల్పెను.

ఋతుపర్ణుఁడా నలునిగాంచి "రాజాధిరాజా! నీయిదం తయుంచుకయుఁ దెలియలేక, యపరాధమొనర్చితిని. క్షమిం పు" మని వేడెను.

న—రాజా! నీవెన్నియోపిధముల నన్నాదరించి యు టివే కాని, నివొనర్చిన యెగ్గులేమి? ఏనెట్టి ప్రత్యుపకార మొన ర్పఁజాలుదును?

పిదప, ఋతుపర్ణుఁడు, భీమరాజునొద్దను, నలునియొద్ద ను సెలవుఁగైకొని, నలునివలన నశ్వహృదయవిద్యను నేర్చి, త ననివాసమునకేగెను.

నలుఁడు దమయంతీసమేతుఁడై, బంధుగులకెల్ల సం తసమునుగొల్పుచుఁ గొంతకాలమటనుండెను.

పదియవప్రకరణము.

పుష్కరుఁడు, నలమహారాజెన్నియో రీతుల నణచుచు న్నను ప్రజాహింతయై బాధలనొనర్చువాఁడు; తానే రాజాధి రాజైనవేళ నెట్టియకార్యములాచరించిన నడ్డుపడువారెవ్వరు?

వీథులవెంబడి యందకత్తెయగు స్త్రీ యెవ్వతైన నొంటరిగాఁ బోవుచు నాతనికంటఁబడెనా పాపమునకైన వెఱువక బలిమిని బట్టును. దీనులఁగాచుటకు మాఱు దీనుల శిక్షించును. ధర్మానువర్తనమున కెదురుగ నధర్మమాచరించుట. ఇట్లు తన రాజ్యమందున్న ప్రజల గఠినహృదయుఁడై పాలించుచుండ నెల్లరేకగ్రీవముగ నంత్యకాలమాసన్నము కానున్నదని దీవనలనిచ్చుచుండిరి.

నలుఁడు విదర్భాపురమును జేరెనని వినుటతోడనే నిషధదేశమందున్నఁ ప[illegible]లో ననేకులటకేగి యాతనిదర్శించి తమ యిడుములనెఱిఁగించి మొరలిడుకొనఁ జొచ్చిరి.

నలుఁడును దానిదివఱకుఁ గలిమాయవలననే జూదమునందోడియుంటినని పూర్ణముగ గ్రహించినవాఁడగుటచే నిప్పుడట్టిచింతలేక తప్పక యీమాఱు పుష్కరుని గెలువఁగలనని నిశ్చయించి తనయుద్దేశమును భీమునకుఁ దెలియఁజేసి యాతని యనుమతిననుసరించి రథ గజ తురగంబులసహాయంబుగఁగొని నిషధదేశమునకుఁ బయనమయ్యెను.

అట్లేగి నలుఁడు పుష్కరునొద్దకుఁబోయి 'పుష్కరా! నీతో మరలజూదమాడనిచ్చతో వచ్చినాఁడ' ననెను.

పు—ఏమి! తిరుగజూదమాడ నెంచితివా! సకలరాజ్య

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA113B124
పుస్తకం పేరు	దమయంతి
తారీఖు	26/10/24
ముందు అట్ట	no
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	1
లేని పేజీలు	NO
తయారు చేసినది	Rehana
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	Mounika
పరీక్ష చేసినది	pragathi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good